

గురువారం 19 నవంబర్ 2026
పేజీలు : 8

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా



ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా దరఖాస్తుల స్వీకరణ పకడ్బందీగా చేపట్టాలి

13

గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి

ఆకలిని దూరం చేస్తేనే చదువుపై ఏకాగ్రత!



17

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు అల్పాహార పథకం ఎంతో దోహదం

మోడల్ స్కూల్‌లో బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించిన మంత్రి వివేక్ వెంకటస్వామి

డైనింగ్ హాల్ నిర్మాణానికి రూ.40 లక్షలు

మంజూరు విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చదవాలి

ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమాతో ఆర్థిక భరోసా

5



ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో ఎలాంటి లోపాలు ఉండకూడదు

అర్హులందరికీ వివి-జి రామ్ జీ పథకం కింద 125 రోజుల పని కల్పించాలి

నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను గడువులోగా పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



13

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్



నేరడిగొండ నవంబర్ 17(ప్రజాజ్యోతి):అనారోగ్యంతో బాధ పడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి భరోసాగా నిలుస్తోందని బోథ్ శాసనసభ్యులు అనిల్ జాదవ్ పేర్కొన్నారు. బుధవారం నేరడిగొండ మండల కేంద్రంలోని తన నివాసంలో బోత్ నియోజకవర్గానికి చెందిన 97 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.20,44,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో సీఎం సహాయ నిధి ఎంతగానో దోహదపడుతోందన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో లబ్ధిదారులతో పాటు బోత్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సోనాల విద్యార్థిని రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ క్రీడలకు ఎంపిక



సోనాల, నవంబర్ 18 (ప్రజాజ్యోతి):సోనాల మండల కేంద్రానికి చెందిన ప్రతిభావంతురాలైన విద్యార్థిని ఎస్. వర్షిత రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ క్రీడలకు ఎంపికైంది. పాఠశాల క్రీడా వేదికపై తన ప్రతిభను కనబరిచిన ఈ విద్యార్థిని, అంకితభావం మరియు కృషితో అంచలంచెలుగా ఎదుగుతూ, ఈ అరుదైన ఘనతను సాధించింది. ఇటీవల జరిగిన జోనల్ స్థాయి అండర్ – 17 నెట్ బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరచడంతో పాటు, తన చురుకైన ఆటతీరుతో సెలెక్టర్లను ఆకట్టుకుని రాష్ట్ర స్థాయికి అర్హత సాధించినట్లు పాఠశాల పిడి శైలజ తెలిపారు. క్రీడల్లో రాణిస్తూ తమ పాఠశాలకు, గ్రామస్థులకు మంచి పేరు తెస్తున్న ఈ యువ క్రీడాకారిణిని గ్రామస్తులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేంద్రప్రసాద్ ఉపాధ్యాయ బృందం మరియు సహచర విద్యార్థిని విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయిలోనూ పతకం సాధించి, గ్రామానికి మరింత కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు: సర్పంచ్ శ్రీకాంత్



నేరడిగొండ, నవంబర్ 18 (ప్రజాజ్యోతి):గ్రామీణ ప్రాంతాల్లో పేదలు, వృద్ధులు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మండలంలోని వడూర్ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఆడెపు శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తామని తెలిపారు. పింఛన్ల ద్వారా పేదలకు ఆర్థిక చేయూత లభిస్తుందని, అర్హత కలిగిన వారు ఎవరూ సంక్షేమ ఫలాలకు దూరం కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎరర్ల మమత చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి సద్దాం శంకర్, ఆత్మ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

దళిత నాయకుడిపై దాడి.. అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



మురికి కాల్వ పనుల్లో అక్రమాలను ప్రశ్నిస్తే దాడి చేస్తారా?



ఆసిఫాబాద్, నవంబర్ 18 ప్రజా జ్యోతి దళిత నాయకుడు చాపిడి సురేష్‌పై కులం పేరుతో దూషిస్తూ దాడి చేసిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి బాధితుడికి న్యాయం చేయాలని టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కిరిమల వినోద్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసిఫాబాద్ మండలం సాలెగూడ గ్రామంలో సురేష్ ఇంటి ముందు నిర్మించిన మురికి కాల్వపై ప్రజలు నడిచేందుకు బిళ్లలు ఏర్పాటు చేయాలని గ్రామ సర్పంచ్‌ను కోరినందుకే ఈ దాడి జరిగిందని ఆరోపించారు. ఈ క్రమంలో సర్పంచ్ అనుచరుడిగా పేర్కొంటున్న బామ్నే రాజారాం అనే వ్యక్తి సురేష్‌ను కులం పేరుతో దూషిస్తూ విచక్షణారహితంగా దాడి చేశాడని తెలిపారు. ఈ దాడిలో సురేష్ ఎడమ చెంప, చెవికి తీవ్ర వాపు వచ్చిందని పేర్కొన్నారు. ప్రజా సమస్యను ప్రశ్నించినందుకు దాడి చేయడం అన్యాయమని, ఏదైనా తప్పు ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలే తప్ప చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సరికాదన్నారు. ఈ ఘటనపై పార్టీ నాయకులతో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. పోలీసులు వెంటనే స్పందించి బాధ్యులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు.

దాడులతో మా ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు

మురికి కాల్వ నిర్మాణంలో జరిగిన అవకతవకలను ప్రశ్నిస్తే దాడులు చేస్తారా? అని తెలంగాణ రక్షణ సేన పార్టీ సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కావేటి సబితా మనోహర్ ప్రశ్నించారు. బుధవారం బాధితుడు సురేష్ తరఫున ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి పనుల్లో అక్రమాలు జరిగినట్లు అనుమానం వస్తే ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. దళిత నాయకులు ప్రజాప్రతినిధులను పనులపై నిలదీయకూడదా అని ప్రశ్నించారు. దాడులు, బెదిరింపులతో తమ మనోధైర్యాన్ని దెబ్బతీయలేరని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కావేటి మనోహర్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ అశోక్, పెండోర్ ధార్ము, మాచర్ల శ్రీనివాస్, కొట్నాక కిషన్, దుర్గం శ్యామ్ రావు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

-ఆదివాసి సంఘాల పిలుపు



సోనాల, నవంబర్ 18 (ప్రజాజ్యోతి): ఆదివాసీల హక్కుల సాధన, ఆదివాసీ అస్తిత్వ పరిరక్షణ, రాజ్యాంగ హక్కుల అమలు లక్ష్యంగా డిసెంబర్ 9న హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్షలాది ఆదివాసీల భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేష్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సోనాల మండల కేంద్రంలో డిసెంబర్ 9న నిర్వహించనున్న చలో హైదరాబాద్ భారీ బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.డిసెంబర్ 9న హైదరాబాద్‌లో జరిగే ఈ భారీ బహిరంగ సభకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని తొమ్మిది తెగల ఆదివాసీ ప్రజలు, యువత, మహిళలు, విద్యార్థులు, ఆదివాసీ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో తుడుం దెబ్బ సోనాల మండల కమిటీ మరియు ఆదివాసీ నాయకులు సార్మేడి తొడ్సం లక్ష్మణ్, సోయం బాపురావు, గంగాధర్ ఆత్రం, ప్రధాన కార్యదర్శి రాయ్ సిడాం జాకేష్, జుగనక మారుతి, తోడశం సుంగన్న, వజ్జర్ సర్పంచ్ లక్ష్మణ్, నైతం దేవరావ్ మాజీ సర్పంచ్ రాందాస్, ఆత్రం ధర్మన్నా, కోడప నాగరావు ఇచ్చోడ మండల అధ్యక్షులు సిడం దత్తు, సోయం శంకర్ పాల్గొన్నారు.

రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



మంచిర్యాల, 18, నవంబర్ (ప్రజాజ్యోతి): జిల్లాలో చేపడుతున్న భూముల రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని భీమారం మండలం మద్దికల్ గ్రామాన్ని తహసిల్దార్, డిప్యూటీ తహసిల్దార్, ఉపసర్పంచ్ లతో కలిసి సందర్శించి రీసర్వే పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో సందర్శించి పనుల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో భూములకు సంబంధించి ఎలాంటి వివాదాలు తలెత్తకుండా ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తుందని తెలిపారు. రైతులు రీసర్వే ప్రక్రియకు సహకరిస్తుండటం సంతోషంగా ఉందని తెలిపారు. పనుల నిర్వహణకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలోని అంకుశాపూర్ గ్రామంలో నిర్వహించిన రీసర్వే గ్రామసభలో తహసిల్దార్‌తో కలిసి హాజరయ్యారు. గ్రామసభలో రీసర్వే ప్రక్రియకు సంబంధించిన అంశాలను పరిశీలించి, రైతుల భాగస్వామ్యంతో పనులను సమర్థవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రీసర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

జిల్లా కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్ నవంబర్ 18 ప్రజా జ్యోతి పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ పథకానికి 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. లబ్ధిదారుల గుర్తింపునకు రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకుంటామని, రేషన్ కార్డులు లేని వారి వివరాలను ఆధార్ ఆధారంగా సేకరిస్తామని వెల్లడించారు.జిల్లాలోని 335 గ్రామపంచాయతీలు, రెండు మున్సిపాలిటీల పరిధిలో గ్రామపంచాయతీలు, మున్సిపల్ వార్డుల వారీగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించి అర్హుల వివరాలను సేకరించాలని సూచించారు. సేకరించిన దరఖాస్తులను లబ్ధిదారుల సంతకాలతో సహా స్కాన్ చేసి సంబంధిత బీమా సంస్థకు పంపించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం ప్రయోజనం అందేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

వసతి గృహం తనిఖీ



బోథ్, నవంబర్ 18 (ప్రజా జ్యోతి) మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల వసతి గృహాన్ని, ఎంపీడీవో ఎల్ రమేష్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. అలాగే పాఠశాలలోని మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమస్యలను తెలుసుకున్నారు. తదానంతరం ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణగా ఉండి కష్టపడి చదవాలని సూచించారు . చదువుతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజంలో మంచి గుర్తింపును పొందాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ కుర్మే మహేందర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శోభ, ప్రిన్సిపల్ అనురాధ, వైస్ ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్, తదితరులుపాల్గొన్నారు

సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి.. లక్ష్య సాధనకు కృషి చేయాలి

విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలి: టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్





ఆసిఫాబాద్, నవంబర్ 18 ప్రజా జ్యోతి విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని, నిర్దిష్ట లక్ష్యాన్ని ఎంచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ సూచించారు. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 17న ఆసిఫాబాద్ ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ వ్యాసరచన, క్విజ్ పోటీల్లో ఏపీజే అబ్దుల్ కలాం హైస్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి కే. శ్రీనివాస్ జిల్లా టాపర్‌గా నిలిచారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో అబ్దుల్ రహమాన్ పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. దివంగత జర్నలిస్టు వెంకటి సేవలు మరువలేనివని, ఆయన కుమారుడు శ్రీనివాస్‌కు టీయూడబ్ల్యూజే అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన శ్రీనివాస్‌ను అతిథులు శాలువాతో సత్కరించి, మెడల్ అందజేశారు. పాఠశాల చైర్మన్ అబుల్ ఫయాజ్ మాట్లాడుతూ తమ విద్యార్థి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ట్రస్మా జిల్లా నాయకుడు చిలుకూరి రాధాకృష్ణ చారి మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి కష్టపడి చదవాలని సూచించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు సలీం బేగ్, పాఠశాల ప్రిన్సిపాల్ హాశం పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుత్పాల మాజీ సర్పంచ్ మృతి.. రోల్ మామడ టోల్ ప్లాజా వద్ద విషాదం



నేరడిగొండ నవంబర్ 18 (ప్రజాజ్యోతి మండలంలోని రోల్ మామడ టోల్ ప్లాజా వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం లో వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గుత్పాల గ్రామానికి చెందిన గస్కంటి రవి మాజీ సర్పంచ్ 45 సం,,లు గుత్పాల గ్రామం నుండి మండల కేంద్రానికి వస్తుండగా రోల్ మామడ టోల్ ప్లాజా వద్ద హైదరాబాద్ వైపు నుండి నాగపూర్ వైపు వెళు తున్న కంటైనర్ టోల్ ప్లాజా వద్ద ఆగి ఉండడంతో ద్విచక్ర వాహనం పై వచ్చి వెనుక నుండి బలంగా ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి వెంటనే అంబులెన్స్ లో అదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించడం జరిగిందని తెలిపారు.

బెజ్జూర్ కేజీబీవీ పీటీ మేడమ్‌ను తక్షణమే తొలగించాలి..

విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి...ఏబీవీపీ బెజ్జూర్ మండల అధ్యక్షుడు విశ్వంత్ గౌడ్.డిమాండ్...




బెజ్జూర్ నవంబర్ 18 (ప్రజాజ్యోతి): బెజ్జూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో పనిచేస్తున్న పీటీ మేడమ్ శంకుల లక్ష్మిపై విచారణ జరిపి, ఆమెను తక్షణమే విధుల నుంచి తొలగించాలని. విద్యార్థినులతో పీటీ మేడమ్ అసభ్యకరమైన రీతిలో చాటింగ్ చేస్తున్నారని, వారి చదువుపై ప్రతికూల ప్రభావం చూపేలా వ్యవహరిస్తున్నారని ఏబీవీపీ నాయకులు ఆరోపించారు. విద్యార్థినుల మానసిక స్థితిపై ఇలాంటి ప్రవర్తన ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.విద్యార్థినులకు విద్యాబుద్ధులు నేర్పి, వారికి ఆదర్శంగా నిలవాల్సిన ఉపాధ్యాయ సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలు నిర్ధారించిన అనంతరం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రానున్న కొద్ది రోజుల్లోగా ఈ వ్యవహారంపై తగిన చర్యలు తీసుకోకపోతే ఏబీవీపీ బెజ్జూర్ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహా ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. విద్యార్థినులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని ఏబీవీపీ నాయకులు స్పష్టం చేశారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమాతో ఆర్థిక భరోసా

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

మంచిర్యాల, 18, నవంబర్ (ప్రజాజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి అర్హత కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, కుటుంబంలో సంపాదించే వ్యక్తి ఆకస్మికంగా మరణించినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురి కాకుండా 5 లక్షల రూపాయల జీవిత బీమా రక్షణ కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పథకం క్రింద ప్రతి కుటుంబంలో 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన సంపాదించే ఒక వ్యక్తిని బీమా పరిధిలోకి తీసుకోవాలని, కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది సంపాదిస్తున్నట్లయితే ఎవరిని బీమా పరిధిలోకి తీసుకోవాలనేది కుటుంబ సభ్యులే నిర్ణయించుకునే అవకాశం కల్పించాలన్నారు. కుల, మత, ఆదాయ భేదాలు లేకుండా అర్హులైన కుటుంబాలకు పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరించనున్నందున లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదని తెలిపారు. నమోదు ప్రక్రియలో భాగంగా గ్రామాలు, పట్టణాలు, వార్డుల వారీగా ప్రత్యేక సహాయక నమోదు శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రేషన్ కార్డుల వివరాల ఆధారంగా కుటుంబాలను గుర్తించడంతో పాటు, రేషన్ కార్డులలో పేర్లు లేని వారు, రేషన్ కార్డులు లేని కుటుంబాలకు కూడా ప్రత్యేక దరఖాస్తు విధానం ద్వారా నమోదు అవకాశం కల్పించాలని సూచించారు. బీమా పొందే వ్యక్తి వివరాలు, ఆధార్ ఆధారిత పుట్టిన తేదీ, కుటుంబ సభ్యులు, నామినీల వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని, ఒకరి కంటే ఎక్కువ మంది నామినీలను ఎంపిక చేసుకునే అవకాశం ఉన్నందున వారికి అందే వాటాలను స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తుల నమోదు, అవసరమైన సేవలు అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, మంచిర్యాల జిల్లాలో పథకం అమలుకు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ను నోడల్ అధికారిగా నియమించడం జరుగుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పట్టణ ప్రాంతాలలో మున్సిపాలిటీల ఆధ్వర్యంలో నమోదు ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని వివరించారు. పథకం విజయవంతంగా అమలు చేసేందుకు ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తామని, మండల స్థాయి అధికారులు, వార్డు అధికారులకు ప్రభుత్వం నిర్దేశించిన ఎస్ఓపిపై శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. నమోదు ప్రక్రియను సులభతరం చేసేందుకు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపాలిటీలకు ప్రత్యేక లాగిన్ సదుపాయం కల్పించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రతి నమోదు శిబిరంలో ఇంటర్నెట్ కనెక్షన్, ప్రింటర్, స్కానర్ వంటి అవసరమైన సాంకేతిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 2 గ్రామాలు మినహా మిగిలిన అన్ని గ్రామాలలో శిబిరాల ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన 2 గ్రామాలలో ముందుగా నింపిన దరఖాస్తు ఫారాలను శిబిరాలలో అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సిబ్బంది, మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖల సమన్వయంతో ప్రతి అర్హత కుటుంబానికి పథకంపై అవగాహన కల్పించి, ఎవరూ మిగిలిపోకుండా నమోదు ప్రక్రియను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం.. త్వరలోనే తీవ్రస్థాయి ఆందోళనలు

సొంతింటి పథకాన్ని వంద శాతం అమలు చేయిస్తాం..

అలవెన్సులపై ఆదాయపు పన్నును యాజమాన్యమే భరించేలా కృషి

ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్

మంచిర్యాల, 18, నవంబర్ (ప్రజాజ్యోతి): సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని, యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని విడనాడి కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్యం కొనసాగిస్తే త్వరలోనే తీవ్రస్థాయి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-5 గని వద్ద ఐఎన్‌టీయూసీ యూనియన్ పిట్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌కు శ్రీరాంపూర్ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ ల్యాగల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బి. జనక్ ప్రసాద్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ, సింగరేణి కార్మికులకు అలవెన్సులపై చెల్లించాల్సిన ఆదాయపు పన్నును యాజమాన్యమే భరించేలా త్వరలో నిర్ణయం వచ్చే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్మికుల సొంతింటి కలను సాకారం చేసే దిశగా సొంతింటి పథకాన్ని వంద శాతం అమలు చేయిస్తామని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. కార్మికుల మారుపేర్ల సమస్యను త్వరలో పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నామని, యాజమాన్యం మొండి వైఖరి కారణంగా జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. మైనింగ్ సూపర్‌వైజర్లు, ఓవర్‌మెన్‌లకు అర్హత మేరకు కాలపరిమితి ఆధారిత పదోన్నతులు సకాలంలో కల్పించేలా ఒత్తిడి తెస్తున్నామని, ఈపీ ఆపరేటర్ ఉద్యోగులకు వెంటనే ఏ గ్రేడ్ పదోన్నతులు కల్పించేలా యాజమాన్యంతో చర్చలు జరుపుతున్నామని తెలిపారు . త్వరలో జరగనున్న బొగ్గు గనుల వేలంలో కోయగూడెం-3, శ్రవణపల్లి ప్రాజెక్టులు సింగరేణికి దక్కేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, ఈ ప్రాజెక్టులు సింగరేణికే కేటాయిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సింగరేణి యాజమాన్యానికి ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్యాన్ని వీడి తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షులు, క్రమశిక్షణా సంఘం చైర్మన్ కాంపెల్లి సమ్మయ్య, కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షులు జెట్టి శంకర్ రావు, కేంద్ర ఉపాధ్యక్షులు కలవేణి శ్యామ్, బ్రాంచ్ ఉపాధ్యక్షులు శీలం చిన్నయ్య, జనరల్ సెక్రటరీ జీవన్ జోయల్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ గరిగ స్వామి, ఏరియా కార్యదర్శులు చంద్ర మోహన్, రామకృష్ణ, మహేష్, పెద్దిరాజు, మైనింగ్ స్టాఫ్ నాయకులు సందీప్, శ్రీనివాసరావు, సంపత్, గని పిట్ కార్యదర్శి కొత్తూరు నంబయ్య, అసిస్టెంట్ పిట్ కార్యదర్శులు మహేశ్వర్ రెడ్డి, రవి, నాయకులు శ్రీధర్ల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



లేబర్ కోడ్స్ రద్దు, కనీస వేతనం రూ.42 వేలు నిర్ణయించి చెల్లించాలి

కనీస పెన్షన్ పెంపు, స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలి దుంపల రంజిత్ కుమార్ సీఐటీయు జిల్లా కార్యదర్శి

ఉద్యోగ భద్రత, పర్మినెంట్ కోసం – 2026 డిసెంబర్ 1,2, 3 ఛలో ఢిల్లీ వాల్ పోస్టర్లు విడుదల

మంచిర్యాల, 18, నవంబర్ (ప్రజాజ్యోతి): లేబర్డ్ రద్దు, కనీస వేతనం రూ.42 వేలు నిర్ణయించి చెల్లించాలని, కనీస పెన్షన్ పెంపు, స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు . మంచిర్యాల పట్టణంలో బుధవారం రోజున సీఐటీయు కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశంను నిర్వహించారు . ఈ సందర్భంగా లేబర్ కోడ్ల రద్దు, కనీస వేతనం రూ.42 వేలు, కనీస పెన్షన్ పెంపు, సమస్త కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 2026 డిసెంబర్ 1, 2,3న జరిగే ఛలో ఢిల్లీ పార్లమెంట్ కు సంబందించిన వాల్ పోస్టర్ ను విడుదల చేశారు . ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు పూర్తయినా కార్మికుల వేతనాలు, ఆదాయం, పెన్షన్లలో ఎదుగూ, బొదుగూ లేదు. మన శ్రమతో సృష్టించిన సంపదలను పోగేసుకుని యజమానులు కుబేరులవుతున్నారని, పాలక వర్గాలకు కార్మిక సంక్షేమం ఏ మాత్రం పట్టడం లేదని, కార్పొరేట్లు, పారిశ్రామికవేత్తల ప్రయోజనాలే పాలక వర్గాల ప్రయోజనాలుగా మారాయన్నారు . ఏ రంగంలో చూసినా అదానీ, అంబానీ, టాటా, బిర్లా, మిట్టల్లు పాలక వర్గాల ప్రతినిధులుగా ప్రత్యక్షమౌవుతున్నారని, రాజ్యాంగం, రాజ్యాంగ బద్ధంగా ఏర్పడ్డ స్వయం ప్రతిపత్తి గల సంస్థలను తమ జేబు సంస్థలుగా మార్చుకుంటున్నారని, కార్మిక, ప్రజాస్వామ్య హక్కులపై నిర్బంధం ప్రయోగిస్తున్నారని తెలిపారు . దేశంలో ఒక శాతం సంపన్నుల వద్ద దేశ సంపదలో 40 శాతం పోగుపడిందని, దేశ జనాభాలో అట్టడుగున 50 శాతంగా ఉన్న ప్రజల వాటా 6 శాతం మాత్రమే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంపన్నుల మీద జాలి ఎక్కువ. కార్మికులకు కనీస వేతనాలు పెంచేందుకు వారికి చేతులు రావడం లేదని, కానీ మనం చెల్లించే పన్నులతో కార్పొరేట్లు, పారిశ్రామికవేత్తలకు ఎదురు రాయితీలు ఇచ్చి వారిని మరింత సంపన్నులుగా చేస్తున్నాయన్నారు . రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కార్మిక హక్కులు, సమస్యలు పరిష్కరించడంలో బిజెపి అడుగుజాడల్లో నడుస్తున్నదని, 4 లేబర్ కోడ్లను వ్యతిరేకించకుండా వాటికి రూల్స్ రూపొందించి అమలు చేయాలని ఉవ్విళ్ళూరుతున్నదని, రాష్ట్రంలో షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్స్ యాక?్టను సవరించి ఆ సంస్థల్లో 10 గంటల పని దినం అమలుకు జీఓ ఇచ్చిందని, కార్మిక సంఘాలతో చర్చించడం లేదని, 2023లో ఎన్నికల సందర్భంగా కార్మికులకు ఎన్నో వాగ్దానాలు చేసిందని కానీ నేటికీ అమలు చేయలేదన్నారు . కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల శాఖలు , ప్రైవేట్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, టైమ్స్కేల్, కంటింజెంట్, ఎన్ఎంఆర్ గౌరవ వేతన తదితర ఉద్యోగులను, నాన్ పర్మినెంట్, ఫిక్స్ టర్మ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, ప్రైవేట్ కార్పొరేట్ల దోపిడీ ఇకనైనా ఆపాలని, సంపన్నులకు రాయితీలు ఇవ్వటం మానేసి వారి సంపదలపై అధిక పన్నులు వేసి కార్మిక డిమాండ్లను పరిష్కరించాలన్నారు . భూమి, నీరు, అడవులపై ప్రజల హక్కులు పరిరక్షించాలని, వీటిని కార్పొరేట్లకు కట్టబెట్టరాదని, పై డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ



డిసెంబర్ 1న ఉదయం 10 గంటలకు ఢిల్లీ రా...లా మైదానం నుండి పార్లమెంట్కు కదులుదాం, కేంద్ర ప్రభుత్వం నుండి హామీ వచ్చే వరకు ప్రతిఘటన కొనసాగిద్దాం, తెలంగాణ రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక విధానాలను, పాలకులు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడదాం అన్నారు . లేబర్ కోడ్ల రద్దు, కనీస వేతనం రూ.42 వేలు, కనీస పెన్షన్ పెంపు, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తింపు, ఉద్యోగ భద్రత, పర్మినెంట్ మరియు సమస్త కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 2026 డిసెంబర్ 1 నుంచి 3 వరకు ఢిల్లీ పార్లమెంటుకు కదలి రావాలని సిఐటియు జిల్లా కమిటీ కార్మికవర్గానికి పిలుపునిస్తోందన్నారు ఈ కార్యక్రమంలో గోమాస ప్రకాష్ సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు, సాంబారి వెంకటస్వామి, దాగం రాజారాం జిల్లా సహాయ కార్యదర్శులు, అంబటి లక్ష్మణ్ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ!

మంచిర్యాలరూరల్ నవంబర్18(ప్రజాజ్యోతి) ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు క్షేత్రస్థాయిలో ప్రజలకు పూర్తిస్థాయిలో అందాలని ఆరోగ్య కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యానికి తావుండకూడదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.నరేందర్ రాథోడ్ స్పష్టం చేశారు. తాళ్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి వైద్యులు,సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాల్లో వందశాతం లక్ష్యాలను సాధించాలని వైద్యులు,సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. గర్భిణుల నమోదు,నాలుగు విడతల వైద్య పరీక్షలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు, చిన్నారులకు పూర్తి స్థాయి టీకాలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తూ సిజేరియన్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. క్షయ,కుష్ఠు వ్యాధి గ్రస్తుల గుర్తింపు, బీపీ, షుగర్ వ్యాధుల నియంత్రణ, మానసిక ఆరోగ్య కార్యక్రమాలు,టెలీ మానస్, ఈ–సంజీవని సేవలను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. ఆసుపత్రుల్లో మందుల నిల్వలు, వ్యాక్సిన్ల నిర్వహణ, పారిశుద్ధ్యం పై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న సమీక్షకు అనుగుణంగా అన్ని ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని మెరుగుపరచాలని సూచించారు. వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డా. వంశీకృష్ణ, పర్యవేక్షకురాలు మార్త, డెమో బుక్క వెంకటేశ్వర్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రాజ్యాంగ విలువల పరిరక్షణకు, ఉద్యోగుల ఐక్యతకు పెద్దపీట

శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

మంచిర్యాల, 18, నవంబర్ (ప్రజాజ్యోతి): సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయంలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ అధికారులు, ఉద్యోగుల సమావేశం బుధవారం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని సభ్యులందరి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి శ్రీరాంపూర్ ఏరియా డిప్యూటీ జనరల్ మేనేజర్ (పర్సనల్) డాక్టర్ ఎస్. అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఐఈ) పి. రాజన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నికతో పాటు 76వ భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకల నిర్వహణ, భవిష్యత్తు కార్యాచరణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సదర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా డాక్టర్ ఎస్. అనిల్ కుమార్ (డీజీఎం-పర్సనల్), అడ్వైజర్‌గా పి. రాజన్న (డీజీఎం-ఐఈ) ఎంపికయ్యారు. కో-కన్వీనర్లుగా కే. రవి (ఏఓ), జే. సంగీత (ఈఈ), దారావత్ రాజేష్, సంజయ్ యాదవ్, జై కుమార్, అజ్మీర గణేష్, ఎస్. శ్రావణ్ కుమార్ లు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా జి. నవీన్, సీహెచ్. మౌనిక, సీహెచ్. రజిత, కే. సుమన్, కే. కీర్తి, స్వామి, బానోత్ గీత, జుమ్మిడి శ్యామల, కే. తనుజ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వక్తలు



మాట్లాడుతూ, అధికారుల, ఉద్యోగుల మధ్య ఐక్యత, సమన్వయం, పరస్పర సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని సూచించారు భారత రాజ్యాంగం అందించిన సమానత్వం, సామాజిక న్యాయం, సోదరభావం వంటి విలువలను పరిరక్షిస్తూ ముందుకు సాగాలని పేర్కొన్నారు. నూతన కమిటీ సమిష్టి కృషితో అధికారుల, ఉద్యోగుల సంక్షేమానికి, సంఘటిత శక్తిని బలోపేతం చేయడానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ లైజన్ ఆఫీసర్ ఆర్. గుండెరావుతో పాటు పలువురు అధికారులు, ఉద్యోగులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బొగ్గు నాణ్యతలో శ్రీరాంపూర్ ఏరియాకు ద్వితీయ బహుమతి

78.85 శాతం గ్రేడ్ సంతృప్తితో సింగరేణిలో రెండో స్థానం..

సమిష్టి కృషితో మళ్లీ ప్రథమ స్థానానికి చేరుకుంటాం

శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్

మంచిర్యాల, 18, నవంబర్ (ప్రజాజ్యోతి): సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ పరిధిలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బొగ్గు నాణ్యతలో శ్రీరాంపూర్ ఏరియా ద్వితీయ బహుమతిని సాధించింది. 78.85 శాతం గ్రేడ్ సంతృప్తి సాధించి సింగరేణిలోని అన్ని ఏరియాల్లో రెండో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా బుధవారం గోదావరిఖనిలోని ఇల్లందు క్లబ్‌లో నిర్వహించిన కోల్ క్వాలిటీ అవేర్‌నెస్ వీక్ ముగింపు కార్యక్రమంలో డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కె. వెంకటేశ్వర్లు చేతుల మీదుగా శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్, ఏరియా అధికారులతో కలిసి ద్వితీయ బహుమతిని స్వీకరించారు. నవంబర్ 12 నుంచి 18 వరకు సింగరేణి వ్యాప్తంగా నిర్వహించిన బొగ్గు నాణ్యత వారోత్సవాల్లో భాగంగా అన్ని ఏరియాల గనులు, కార్యాలయాలు, వివిధ విభాగాల్లో బొగ్గు నాణ్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బొగ్గు నాణ్యత ప్రాధాన్యత, వినియోగదారుల ఆదరణ పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బొగ్గు నాణ్యత పురస్కారాలను అందజేశారు. యాజమాన్యం సూచనల మేరకు శ్రీరాంపూర్



ఏరియాలో బొగ్గు నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని జీఎం మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రథమ బహుమతి సాధించగా, 2025-26లో ద్వితీయ బహుమతి పొందడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో అధికారులు, కార్మికుల సమిష్టి కృషితో శ్రీరాంపూర్ ఏరియాను తిరిగి ప్రథమ స్థానంలో నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏ.వి.రెడ్డి, ఎస్ఆర్పీ ఓసీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ సీహెచ్. వెంకటేశ్వర్లు, సీహెచ్పీ ఇన్‌చార్జి చంద్రలింగం, శ్రీరాంపూర్ ఏరియా క్వాలిటీ ఇన్‌చార్జి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కుమారుడి పుట్టినరోజున సేవా స్ఫూర్తి.. విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ!



నేరడిగొండ నవంబర్ 18(ప్రజాజ్యోతి): 'చేయూత ఫౌండేషన్' చైర్మన్ ఎన్.టి. రమణ తన కుమారుడు జాన్ పాల్ జన్మదినాన్ని పురస్కరించుకుని కుమారి గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, ఇతర విద్యా సామగ్రిని పంపిణీ చేసి ఆదర్శంగా నిలిచారు.ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని, విద్యార్థులంతా క్రమశిక్షణ తో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించా రు. జన్మదిన వేడుకలను కేవలం వ్యక్తిగత సంబరాలకే పరిమితం చేయకుండా, పేద విద్యార్థులకు ఉపయోగపడేలా సేవా కార్యక్ర మం నిర్వహించడం ఎంతో అభినందనీయమని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగారాం, శివలీల తదితరులు జాన్ పాల్‌కు జన్మదిన శు భాకాంక్షలు తెలుపుతూ, భవిష్యత్తులో ఉన్నత ఆశయాలతో మరింత అభివృద్ధి సాధించాలని దీవించారు.

డిసెంబరు 9న చలో హైదరాబాద్

ఆదివాసీ హక్కుల సభకు తొమ్మిది తెగల మద్దతు

ప్రతి ఆదివాసీ కుటుంబం నుంచి ఒకరు తరలిరావాలి



ఆసిఫాబాద్ నవంబరు 18 ప్రజా జ్యోతి ఆదివాసీల హక్కుల సాధన కోసం డిసెంబరు 9న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఆదివాసీ హక్కుల సభకు తొమ్మిది తెగల సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. సభకు ప్రతి ఆదివాసీ కుటుంబం నుంచి కనీసం ఒక్కరు హాజరయ్యేలా గ్రామస్థాయిలో కార్యాచరణ చేపట్టాలని సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.వాంకిడి మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో బుధవారం తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు పంద్రం సురేష్ అధ్యక్షతన చలో హైదరాబాద్ సన్నాహక సమావేశం నిర్వహించారు. తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపాతి అరుణ్‌కుమార్ ఆదేశాల మేరకు తొమ్మిది తెగల ఆదివాసీ సంఘాల నాయకులు సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. 2017లో సరూర్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమం కంటే అధిక సంఖ్యలో ఆదివాసీలు ఈసారి పాల్గొనేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మండలంలోని ప్రతి ఆదివాసీ గ్రామంలో గ్రామ పటేల్‌లు, సర్పంచులు సమావేశాలు ఏర్పాటు చేసి సభ ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలని కోరారు. మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, యువత కూడా పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సోయం భీమ్‌రావు, సిడం అన్నిగా, కోవ్వేత జంగు, కొట్నాక భీమ్‌రావు, సిడం నాగోరావు, పెందోర్ మారుతి, దుర్వ లక్ష్మణ్, కొట్నాక రాంశావ్, గుండి రాజయ్య, సిడం పగ్గు, ఆత్రం జగన్నాథ్, మెస్రం దేవురావు, మడావి భీమ్‌రావు, సిడం సోనీరావు, సోయం చందానషా, ఉయ్యాల రాము, దుర్వ దిందు, కార్పెత యశ్వంత్, దుర్వ ముకుందరావు, జూగ్నక్ అంబారావు, కొట్నాక కిషన్‌రావు, సిడం చక్రం, కొట్నాక బీర్షావ్, జూగ్నక్ మనోహర్, ఆత్రం సోము, ఆత్రం జంగు, సోయం మనుకు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత వృత్తి విద్యా శిక్షణ.. దరఖాస్తులకు ఆహ్వానం

టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్ కోర్సుల్లో మూడు నెలల శిక్షణ

శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్



మంచిర్యాల, 18, నవంబర్ (ప్రజాజ్యోతి): మహిళా సాధికారతే లక్ష్యంగా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలు, యువతులకు ఉచిత వృత్తి విద్యా శిక్షణ అందించేందుకు ఔత్సాహిక అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. ప్రతి ఏడాది నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా ఈ ఏడాది కూడా టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్ కోర్సుల్లో మూడు నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు . శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులు స్వయంగా ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను పొందేలా ఆయా కోర్సుల్లో నైపుణ్యాన్ని పెంపొందించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణకు సింగరేణి ఉద్యోగుల కుటుంబ సభ్యులతోపాటు స్థానిక మహిళలు, యువతులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అభ్యర్థులు కనీసం ఏడో తరగతి లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగి ఉండాలని, ఆసక్తి గలవారు నవంబర్ 23, 2026వ తేదీలోపు శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని వివరించారు . గతంలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఏదైనా వృత్తి శిక్షణ కోర్సులో శిక్షణ పొందినవారు తిరిగి అదే కోర్సులో చేరేందుకు అవకాశం లేదని, ఒకసారి ఒకే కోర్సులో శిక్షణ పొందేందుకు మాత్రమే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ కల్పిస్తున్న ఈ ఉచిత వృత్తి విద్యా శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలని జీఎం మునిగంటి శ్రీనివాస్ కోరారు.

మద్యం మత్తులో వాహనం నడిపిన వ్యక్తికి రూ.3 వేల జరిమానా

ఒకరోజు కమ్యూనిటీ సర్వీస్

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు

ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎం.డి. హన్నన్

మంచిర్యాల, 18, నవంబర్ (ప్రజాజ్యోతి): మంచిర్యాలలో మద్యం మత్తులో వాహనం నడుపుతూ ట్రాఫిక్ అనలైజర్ పరీక్షలో 347 రీడింగ్ నమోదైన కుమ్మరి సురేష్‌ను ట్రాఫిక్ పోలీసులు కోర్టులో హాజరుపరిచారు.ఈ కేసును విచారించిన మంచిర్యాల సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రమేష్ బుధవారం నిందితుడికి 3 వేల జరిమానా విధించడంతో పాటు, ఒకరోజు పాటు మంచిర్యాల పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించే ప్లకార్డులు ప్రదర్శిస్తూ కమ్యూనిటీ సర్వీస్ చేయాలని ఆదేశించారు. బుధవారం 8 డ్రంక్ అండ్ డ్రైవ్ (డి డి) కేసులను న్యాయమూర్తి విచారించి రూ. 17 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎం.డి. హన్నన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వాహనదారుల ప్రాణాలకే కాకుండా, రోడ్డుపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం వాటిల్లుతుందని తెలిపారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం వల్ల ఒకరు చేసే తప్పుకు అమాయకులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని,



ఒక్కరి నిర్లక్ష్యం అనేక కుటుంబాల జీవితాలను ప్రభావితం చేస్తుందని హెచ్చరించారు. వాహనదారులు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిరంతరం పర్యవేక్షణ కలిగి ఉండాలని, చిన్ననాటి నుంచే వారికి క్రమశిక్షణ, బాధ్యతాయుత ప్రవర్తన, సమాజంలో మంచి మార్గంలో నడుచుకునే విధానాలను నేర్పించాలని కోరారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు

దస్తూరాబాద్ మండలంలో 217 కొత్త పెన్షన్ మంజూరు కళ్యాణ్ లక్ష్మి చెక్కుల పంపిణీ,

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్





ఖానాపూర్ దస్తురాబాద్ నవంబర్ 18(ప్రజా జ్యోతి) ఖానాపూర్ నియోజకవర్గంలోని దస్తూరాబాద్ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ 217 మంది లబ్ధిదారులకు నూతన పెన్షన్ మంజూరు పత్రాలను, అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ ఎఫ్) చెక్కులతో పాటు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మహిళా స్వయం సహాయక సంఘాల కోసం నిర్మించనున్న వివో భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు.19 నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇందిరమ్మ భీమా పథకానికి సంబంధించిన కార్యక్రమం ప్రారంభం కానుందని పేర్కొన్నారు. అలాగే ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, నీటిని ఒడిసిపట్టేందుకు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిషన్ ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గొల్లగూడలో ఇందిరమ్మ ఇంటి స్లాబ్ పనులు ప్రారంభం

పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

ఆసిఫాబాద్, నవంబర్ 18 ప్రజాజ్యోతి పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు సొంతింటి నిర్మాణానికి ప్రభుత్వం చేయూతనిస్తోందన్నారు.వాంకిడి మండలం ఖమన గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లగూడ గ్రామానికి చెందిన దేశవేణి కవిత--రవి దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో భాగంగా బుధవారం స్లాబ్ పనులను ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ వాంకిడి మండల అధ్యక్షుడు గుర్నూలే మెంగాజీ, సర్పంచ్ గేడం సునీత, ఉపసర్పంచ్ లోబాడే లాహు కుమార్ ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని, లబ్ధిదారులకు అవసరమైన సహాయ సహకారాలు



అందిస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు కొడప మారుతి, జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ అజీమోద్దీన్, మండల కార్యదర్శి కొత్రెంగే మెంగాజీ, సీనియర్ కార్యకర్త పొర్ల శంకర్, బ్రహ్మయ్య గొల్ల, వార్డు సభ్యుడు ప్రవీణ్ కుమార్, నాయకులు దేవయ్య, రాయవేణి శంకర్, గ్రామస్తులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బొగ్గు పెన్షనర్ల సమస్యలను 12వ వేజ్ బోర్డు డిమాండ్ల లో చేర్చాలి

జాతీయ కార్మిక సంఘాలకు సింగరేణి విశ్రాంతి ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి.

బొగ్గు గని కార్మికుల వేతన సవరణకు సంబంధించిన 12వ వేజ్ బోర్డు డిమాండ్లలో బొగ్గు పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను కూడ కోల్ ఇండియా యజమాన్యానికి సమర్పించే, డిమాండ్లలో పొందుపరిచాలని లేదా చేర్పించాలని జాతీయ కార్మిక సంఘాలకు సింగరేణి విశ్రాంతి ఉద్యోగుల సంఘం నాయక్లు మంచిర్యాల జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన సమావేశంలో విజ్ఞప్తి చేశారు . ఈ సమావేశంలో అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య మాట్లాడుతూ, 1998 లో చేసుకున్న అగ్రిమెంట్ మేరకు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి మార్కెట్లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కోల్ మైన్స్ పెన్షన్ పెంచాలని ఒప్పందం ఉన్నా గత 28 సంవత్సరాల నుండి ఒక శాతం కూడా బొగ్గు పెన్షన్ పెంచకపోవడం మూలంగా 84 వేల సింగరేణి విశ్రాంతి ఉద్యోగులు కోల్ ఇండియా వ్యాప్తంగా 5 లక్షల పైచిలుకు మంది(చాలా దుర్భర పరిస్థితుల్లో) చాలీచాలని పెన్షన్ తో జీవితాలను వెల్ల దీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు . ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న ఆసరా పెన్షన్ల కన్నా తక్కువ పెన్షన్ పొందుతున్నారని కన్నీటి పర్యంతం అయినారు.అందుకే 1998 లో చేసుకున్నా బొగ్గు పెన్షన్ అగ్రిమెంట్ సవరించాలని కరుబత్యంతో కూడిన 50 శాతం పెన్షన్ పెంచాలనే డిమాండును 12 వ వేజ్ బోర్డు లో కోల్ ఇండియా యజమాన్యాన్ని డిమాండ్ చేయాలని, అదేవిధంగా కనీస బొగ్గు పెన్షన్ రూ 15 వేలుగా నిర్ణయించాల న్నారు. అలాగే సి పి ఆర్ ఎం ఎస్ హెల్త్ కార్డ్ సంబంధించి అధికారులకు ఇచ్చిన మాదిరిగానే సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు కూడా 25 లక్షల వరకు వైద్యం అందించాలని, పెరిగిన పెరిగిన గ్రాట్యుటీ సీలింగ్ 2016 నుంచె



20 లక్షలు చెల్లించాలన్నారు. సింగరేణి యజమాన్యం ఆధ్వర్యంలోని హైదరాబాదులో ఒక కార్పొరేట్ సూపర్ స్పెషాలిటీ కార్పొరేట్ తరహా అన్ని రకాల వైద్య సౌకర్యాలను ఉద్యోగుల కుటుంబాలకు అందించే విధంగా హాస్పటల్ నిర్మాణం చేయాలని,సొంత గృహాలు లేని సింగరేణి విశ్రాంతి ఉద్యోగులకు కూడా 250 గజాల స్థలం కేటాయించి ఇంటి నిర్మాణానికి వడ్డీ లేని రుణాన్ని ఇవ్వాలని, సింగరేణి ఏరియా హాస్పిటల్ లో విశ్రాంతి ఉద్యోగులకు ఉచితంగానే వైద్య సౌకర్యాలు అందించాలని,గోల్డెన్ షేక్ హ్యాండ్ పెట్టుకున్న ఉద్యోగులకు ఉచితంగా బీపీ, షుగర్ మందులు ఇవ్వాలని తదితర ప్రధాన డిమాండ్లను కోల్ ఇండియా యజమాన్యానికి సమర్పించే 12వ వేజ్ బోర్డు డిమాండ్లలో ఈ సమస్యలను చేర్చాలని జాతీయ కార్మిక వేజ్ బోర్డు సంఘాలకు సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశంలో విజ్ఞప్తి చేశారు .ఈ సమావేశంలో అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య సలహాదారులు ఎం అంజయ్య, శశాంకారావు, కార్యదర్శి పోతరాజుల చంద్రయ్య,ఆర్గనైజింగ్ కార్యదర్శి చెల్లా రాజిరెడ్డి,కార్యవర్గ సభ్యులు నల్లతీ గల ఓదెలు,ఇందూరి రామన్న,శంకర్ రావు, మోత్కూరి రాంబాబు,మచ్చ రాజేశ్వర్ రావు, ముత్యం గంగాధర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

10+2 విద్యా విధానాన్ని స్వాగతిస్తున్నాం

ఇంటర్మీడియట్ కళాశాలలకు 9వ, 10వ తరగతుల అనుమతి ఇచ్చే ఆలోచనను విరమించుకోవాలి

పదవ తరగతి వరకు గుర్తింపు ఉన్న ప్రైవేట్ పాఠశాలలకు 11వ, 12వ తరగతులు నిర్వహించుకునే అవకాశం కల్పించాలి

డాక్టర్ రాపోలు విష్ణువర్ధన్ రావు, టీఆర్ఎస్ఎంఏ, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు

మంచిర్యాల, 18, నవంబర్ (ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన 10+2 విద్యా విధానాన్ని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (టీఆర్ఎస్ఎంఏ) స్వాగతిస్తోందని సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షులు డాక్టర్ రాపోలు విష్ణువర్ధన్ రావు బుధవారం తెలిపారు. పదవ తరగతి పూర్తయిన తర్వాత సుమారు 40 శాతం మంది విద్యార్థులు వివిధ సామాజిక, ఆర్థిక కారణాలతో తదుపరి ఉన్నత విద్యకు దూరమవుతున్నారనే ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో, ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయాలనే ప్రభుత్వ ఆలోచన అభినందనీయమని, విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ నిర్ణయం సమర్థవంతంగా అమలయితే విద్యార్థులు చదువులో కొనసాగింపు పెరగడంతో పాటు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు .అయితే 10+2 విద్యా విధానం అమలు పేరుతో ప్రస్తుతం ఇంటర్మీడియట్ కళాశాలలకు 9వ, 10వ తరగతులను నిర్వహించుకునేందుకు అనుమతి ఇవ్వాలనే ఆలోచనను ప్రభుత్వం పూర్తిగా విరమించుకోవాలని డిమాండ్ చేశారు. 10+2 విద్యా విధానం ఉద్దేశం ప్రస్తుతం పదవ తరగతి వరకు నిర్వహిస్తున్న పాఠశాలలకు 11వ, 12వ తరగతులను విస్తరించుకునే అవకాశం కల్పించడం కావాలి తప్ప, ఇంటర్మీడియట్ కళాశాలలకు 9వ, 10వ తరగతులను అప్పగించడం కాకూడదని స్పష్టం చేశారు. ఇంటర్మీడియట్ కళాశాలలకు 9వ, 10వ తరగతుల నిర్వహణకు అవకాశం కల్పిస్తే, ఇప్పటికే పరిమిత వనరులతో, తక్కువ ఫీజులతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందిస్తున్న వేలాది బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలల మనుగడ ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వల్ల చిన్న, మధ్యతరహా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడంతో పాటు, వాటిపై ఆధారపడి జీవిస్తున్న ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది ఉపాధికి కూడా ఇబ్బందులు ఏర్పడవచ్చని తెలిపారు . ప్రస్తుతం పదవ తరగతి వరకు ప్రభుత్వ గుర్తింపుతో నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలకు అవసరమైన విద్యా ప్రమాణాలు, భద్రతా నిబంధనలకు లోబడి, అనవసరమైన అదనపు ఆర్థిక భారం విధించకుండా 11వ, 12వ తరగతులను నిర్వహించేందుకు అఫిలియేషన్ మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు 2027--28 విద్యా సంవత్సరంలో 11వ తరగతిని అదే పాఠశాలలో కొనసాగించవచ్చా? లేక ఇంటర్మీడియట్ కళాశాలల్లో ప్రవేశాలు పొందాలా? అనే విషయంలో స్పష్టత లేక అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. ఈ అనిశ్చితిని తొలగించేందుకు 10+2 విద్యా విధానం అమలు, పాఠశాలల అప్‌గ్రేడేషన్, అఫిలియేషన్, ప్రవేశాలు, పాఠ్యప్రణాళిక, పరీక్షల విధానం తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పష్టమైన మార్గదర్శకాలతో కూడిన ప్రభుత్వ ఉత్తర్వులు (జి ఓ) విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నూతన విద్యా విధానం కార్పొరేట్



విద్యాసంస్థలకే ప్రయోజనం చేకూర్చే విధంగా కాకుండా, బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలకు కూడా సమాన అవకాశాలు కల్పించే విధంగా ఉండాలని సూచించారు. విద్యా సంస్కరణల పేరుతో దశాబ్దాలుగా విద్యారంగానికి సేవలందిస్తున్న చిన్న, మధ్యతరహా ప్రైవేట్ పాఠశాలలు మూతపడే పరిస్థితి రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు 12వ తరగతి వరకు ఒత్తిడి లేని విద్యను అభ్యసించేలా, అనంతరం ఉన్నత విద్యా ప్రవేశ పరీక్షలకు సిద్ధమయ్యేలా విద్యా విధానంలో తగిన మార్పులు తీసుకురావాలని సూచించారు. ఈ నూతన విద్యా విధానానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకునే ముందు ఎన్‌హెచ్‌పీ వంటి ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, తల్లిదండ్రుల ప్రయోజనాలు, అందుబాటు ఫీజులతో నాణ్యమైన విద్య, బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలుగా ఉండాలన్నారు. 10+2 విద్యా విధానాన్ని తాము వ్యతిరేకించడం లేదని, ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, అయితే పాఠశాలలను 12వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయాలి తప్ప, ఇంటర్మీడియట్ కళాశాలలకు 9వ, 10వ తరగతులు మంజూరు చేసి బడ్జెట్ పాఠశాలల మనుగడను ప్రశ్నార్థకం చేయవద్దని డాక్టర్ రాపోలు విష్ణువర్ధన్ రావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సింగరేణి కార్మికుడి కుటుంబానికి కోటి రూపాయల బీమా చెక్కు అందజేత

బీమా పరిహారాన్ని అందజేసిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు

మంచిర్యాల, 18, నవంబర్ (ప్రజాజ్యోతి): ప్రమాద వశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సింగరేణి కార్మికుడి కుటుంబానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోటి రూపాయల బీమా పరిహారాన్ని బుధవారం అందజేసింది. బెల్లంపల్లి స్టేషన్ రోడ్ కాలనీకి చెందిన పులి మూర్తి కాసిపేట గనిలో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహించేవాడు. గత ఏడాది లక్సెట్టిపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందాడు. ఆయన బెల్లంపల్లి యూనియన్ బ్యాంకులో జీతం ఖాతా కలిగి ఉండటంతో బ్యాంకు అందించే బీమా పథకం ద్వారా కుటుంబానికి కోటి రూపాయల పరిహారం మంజూరైంది. ఈ మేరకు బుధవారం బెల్లంపల్లి యూనియన్ బ్యాంకు శాఖలో నిర్వహించిన కార్యక్రమంలో బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ రవీంద్రబాబు (హైదరాబాద్), డీజీఎం నటరాజన్ (కరీంనగర్), బ్రాంచ్ మేనేజర్ చందన్ కుమార్ చేతుల మీదుగా మృతుడి నామినీలైన భార్య పులి జ్యోత్స్న, తల్లి



అనసూర్యకు కోటి రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా చీఫ్ జనరల్ మేనేజర్ రవీంద్రబాబు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతాతో పాటు తగిన బీమా సౌకర్యాన్ని పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

క్విజ్‌లో సత్తా చాటిన జన్నారం విద్యార్థులు

జన్నారం,నవంబర్18(ప్రజాజ్యోతి) భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో జన్నారం మండల విద్యార్థులు సత్తా చాటారు.ఖానాపూర్ నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు మంగళవారం నిర్మల్ ఐడీఓసీ కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఇందులో కిష్టాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముత్యం ఆహ్వానిత వర్మ, చెట్టుపల్లి మోక్ష శ్రీ, జన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు సేపూరి అలేఖ్య, ఆకుల స్పందనలు జిల్లాలో మొదటి స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.వీరిని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) రమేష్ రాథోడ్ అభినందించారు. వీరితో పాటు గైడ్ టీచర్లు దాముక కమలాకర్, రవీందర్, రాజిరెడ్డి పాల్గొన్నారు.విజేతలను మండల తహసీల్దార్ బక్కయ్య, ప్రధానోపా



ధ్యాయులు గుండా రాజన్న, జన్నారం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రంజిత్ కుమార్, కిష్టాపూర్ గ్రామ సర్పంచ్ వాసాల నరేష్, పాఠశాల చైర్మన్ మంగ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం అభినందించారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోంది ఎమ్మెల్యే బొజ్జు పటేల్

జన్నారం,నవంబర్18(ప్రజాజ్యోతి) ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించేందుకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. జన్నారం మండల కేంద్రంలోని పొనకల్ రైతు వేదికలో అర్హులైన లబ్ధిదారులకు నూతన పెన్షన్ మంజూరు పత్రాలను ఎమ్మెల్యే బొజ్జు పటేల్ పంపిణీ చేశారు. అదేవిధంగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాల ను అమలు చేస్తుందని అన్నారు. అందులో భాగంగానే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇందిరమ్మ బీమా పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు.ఎలినినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు నీటిని పొదుపుగా వినియోగించుకో వాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. అనంతరం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని



ప్రారంభించారు .ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు డీఆర్డీఓ దాసరి అంజయ్య, తహసీల్దార్ బక్కయ్య, ఎంపీడీఓ ఉమర్ షరీఫ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ ఫసిహుల్లా, పొనకల్, చింతగూడ సింగిల్ విండో చైర్మన్లు అల్లం రవి, నాసాని రాజన్న, పార్టీ మండల అధ్యక్షుడు అజ్మీర నందునాయక్ జిల్లా నాయకులు ముజాఫర్ అలీఖాన్, గుర్రం మోహన్ రెడ్డి, పొనకల్ మాజీ సర్పంచ్ జక్కు భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వే వివాదరహితంగా చేపట్టాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా ప్రతినిధి ,నవంబర్ 18 ,(ప్రజాజ్యోతి)భూముల రీసర్వే నిర్వహణలో ఎటువంటి వివాదాలకు తావు ఉండకుండా చూడాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బుధవారం నిర్మల్ అర్బన్ మండలం విశ్వనాథ్ పేట్ సమీపంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను పరిశీలించారు. రీ సర్వే ప్రక్రియ పై అధికారులకు పలు సూచనలు చేశారు. రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టి గడువులోగా పూర్తి చేయాలన్నారు. రీ సర్వే చేపట్టిన వెంటనే సంబంధిత భూముల యజమానులకు వివరాలు అందించాలన్నారు. రీ సర్వే వివరాలన్నింటినీ క్షుణ్ణంగా నమోదు చేయాలని తెలిపారు. రికార్డుల నమోదులో తప్పులు ఉండకూడదని వెల్లడించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ రాజు, సర్వే అధికారులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్ర ప్రజా ఇబ్బందులను తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అంకం మౌనిక మహేందర్

పరిష్కరిస్తాం అన్న ఎమ్మార్వో సుజాత





ఖానాపూర్ నవంబర్ 18 (ప్రజాజ్యోతి)ఖానాపూర్ పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయంలో ఉన్న ఆధార్ కేంద్రానికి సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఖానాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ అంకం మౌనిక మహేందర్ స్వయంగా బుధవారం పరిశీలించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆధార్ సేవల కోసం వచ్చే ప్రజలు వృద్ధులు మహిళలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, ఎమ్మార్వో సుజాత రెడ్డిని కలిసి సమస్యలను వివరించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆధార్ కేంద్రంలో సేవలను మెరుగుపరచాలని, పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా, సకాలంలో అందేలా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కొత్త ఆధార్ కార్డు తో పాటు అడ్రస్ మార్పు తదితర తప్పిదాలను సరిదిద్దే విషయంలో జరుగుతున్న జాప్యం ఇబ్బందికర విషయాలను తెలుసుకొని ఆధార్ లబ్ధిదారులకు ఎలాంటి సమస్యలు వాటిల్లకుండా చర్యలు గైకొంటామని తాసిల్దార్ సుజాతరెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ అంకం మౌనికకు హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బొప్పారం సత్యవతి గుమ్ముల అశోక్ తదితరులు పాల్గొన్నారు

కొత్త ఆసరా పెన్షన్ లబ్ధిదారుల హర్షం
సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

ఖానాపూర్ నవంబర్ 18 (ప్రజాజ్యోతి) తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అందిస్తున్న కొత్త ఆసరా పెన్షన్ లైన చేయూత నిరుపేదలు, ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారుల మంజూరు ఇవ్వడం పట్ల నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో కొత్త లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు శాసనసభ్యులు వెడ్మా బొజ్జు పటేల్ కిఖానాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో పాలాభిషేకం బుధవారం నిర్వహించారు ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వానికి, పేదల పక్షాన అండగా ఉంటున్న నాయకులకు లబ్ధిదారులు తమ కృతజ్ఞతలు తెలియజేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కౌన్సిలర్ రాజుర సత్యం, కౌన్సిలర్లు నిమ్మల రమేష్, సాజిదా



ఖురేషి, ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గొర్రె గంగాధర్ నాయకులు ద్యావతి రాజేశ్వర్, షౌకత్ పాషా, మదిరే సత్యనారాయణ, లావుడ్య లాలు నాయక్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పి.ఎం. శ్రీ పాఠశాలల అభివృద్ధికి ఉత్తమ విద్యా విధానాలపై అధ్యయనం చేయాలి

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల, 18, నవంబర్ (ప్రజాజ్యోతి): ప్రధానమంత్రి శ్రీ పాఠశాలల సమగ్ర అభివృద్ధి, నాణ్యమైన విద్యాబోధన, ఆధునిక బోధనా పద్ధతులు, ఉత్తమ పాఠశాల నిర్వహణ విధానాలపై అధ్యయనం చేసి అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో జిల్లాకు చెందిన 25 మంది పి.ఎం. శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సంబంధిత కో-ఆర్డినేటర్లతో కూడిన బృందం ఈ నెల 21వ తేదీ వరకు 4 రోజుల విద్యా అధ్యయన పర్యటనలో భాగంగా బెంగళూరు, మైసూరు ప్రాంతాలలోని ప్రముఖ విద్యాసంస్థల సందర్శనకు సంబంధించిన పర్యటన బస్సును జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి పి.చంద్రయ్య తో కలిసి బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధ్యయన పర్యటనలో భాగంగా బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్, మైసూరులోని రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ తదితర ప్రముఖ విద్యాసంస్థలను బృందం సందర్శిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా విద్యాసంస్థలలో అమలవుతున్న ఆధునిక విద్యాబోధనా పద్ధతులు,



పాఠశాల నాయకత్వ లక్షణాలు, విద్యా ప్రణాళికలు, వినూత్న బోధనా విధానాలు, విద్యార్థుల సామర్థ్యాల పెంపుదలతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేస్తారని తెలిపారు. విద్యారంగంలో వస్తున్న నూతన మార్పులు, ఆధునిక బోధనా పద్ధతులు, ఉత్తమ పాఠశాల నిర్వహణ విధానాలపై ఉపాధ్యాయులు నిరంతరం అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ అధ్యయన పర్యటనలో తెలుసుకున్న అంశాలు, పొందిన అనుభవాలు, ఉత్తమ విధానాలను తమ పాఠశాలలలో సమర్థవంతంగా అమలు చేసి, పి.ఎం. శ్రీ పాఠశాలలను ఆదర్శ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, పి.ఎం. శ్రీ పాఠశాలల కో-ఆర్డినేటర్లు, 25 మంది ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్ లో భూ రీసర్వే పై అవగాహన

జన్నారం,నవంబర్18(ప్రజాజ్యోతి)జన్నారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో బుధవారం రోజున తహశీల్దార్ బక్కయ్య ఆధ్వర్యంలో మంచిర్యాల డివిజన్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే శేషారావు భూ రీ సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డి ఐ శేషారావు మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం భూ రీ సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఈ కార్యక్రమం వల్ల భూ సమస్యల పరిష్కారం సులభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు అడిగిన సందేహాలు మరియు ప్రశ్నలను నివృత్తి చేసి రీసర్వే యొక్క ప్రాముఖ్యతని దానివల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు.ఈ



కార్యక్రమంలో తహశీల్దార్ బక్కయ్య, రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకటేశం, గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు

అనుమతులు లేకుండా స్మోకింగ్ జోన్లు నిర్వహిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు



జన్నారం,నవంబర్18(ప్రజాజ్యోతి) అనుమతులు లేకుండా జన్నారం మండల కేంద్రంలో స్మోకింగ్ జోన్లు నిర్వహిస్తున్న ముగ్గురు నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉదయ్ కిరణ్ తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం జన్నారం మండల కేంద్రంలో మంగళవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహించగా మండల కేంద్రంలో అనుమతులు లేకుండా స్మోకింగ్ జోన్లు నిర్వహిస్తున్న పొనకల్ గ్రామానికి చెందిన గుర్రాల భరత్, రామటంకి రాజయ్య, గుర్రాల వెంకట సాయి లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ పబ్లిక్ ప్రదేశాల్లో ధూమపానం వల్ల ధూమపానం చేసే వారికే కాకుండా పక్కన ఉండే వారికి కూడా ఆరోగ్య హాని కలుగుతుందని, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, శ్వాస కోస సమస్యలున్న వారిపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. ప్రజా ప్రదేశాల్లో ధూమపాన నిషేధ నిబంధనలు ఉల్లంఘించడం, అనుమతులు లేకుండా స్మోకింగ్ జోన్లు నిర్వహించడం వంటి చర్యలను ఉపేక్షించబోమని అట్టి ఉల్లంఘనలను ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ నెల 28న మంచిర్యాలలో సామాజిక విప్లవ భేరి సభ

గోడ ప్రతులను ఆవిష్కరించిన నాయకులు



మంచిర్యాల, 18, నవంబర్ (ప్రజాజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరగనున్న ఈనెల 28న జైభారత్ సామాజిక విప్లవ రణభేరి సభను విజయవంతం చేయాలని సంఘం నాయకులు కోరారు ఈ మేరకు గోడపత్రులను బుధవారం మంచిర్యాలలో ఆవిష్కరించారు. ఈ నెల 28 శనివారం మంచిర్యాలలోని మైనార్టీ ఫంక్షన్ హాలులో జరగనున్న ఈ సభలో ముఖ్య వక్తగా జైభారత్ జాతీయ ప్రధాన కార్యదర్శి రమణ మూర్తి పాల్గొంటారని వారు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీ వర్గాల ప్రజలు సామాజిక న్యాయం కోసం ఉద్యమిస్తున్నారని ప్రజల హక్కులు నిలబడాలంటే దేశ రాజ్యాంగం బలోపేతం కావాలన్నారు. రాజ్యాంగ మౌలిక సూత్రాలయిన సెక్యులరిజం, జాతీయ సమైక్యత, సామాజిక న్యాయాలపై మనువాద దోపిడీ వర్గాలు దాడులు చేస్తున్నాయని వారు తెలిపారు. రాజ్యాంగం రక్షించబడితే నే పీడిత వర్గాల ప్రజల హక్కులు నిలబడతాయని అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని రక్షించడం నేటి కాలపు దేశభక్తియుత కర్తవ్యంగా నిలిచిందని తెలిపారు . మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీ వర్గాల ప్రజలు, శ్రమజీవులు, ప్రజాస్వామిక వాదులందరూ పాల్గొని ఈ సామాజిక విప్లవ భేరి సభను విజయవంతం చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో సామాజిక విప్లవ భేరి అధ్యక్షులు జీవన్ జోయల్, బీసీ మేధావుల ఫోరం జిల్లా కోఆర్డినేటర్ శ్రీరామోజు కొండయ్య, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర నాయకులు జైపాల్ సింగ్, సింగరేణి విశ్రాంత కార్మికుల సంఘం నాయకులు గజెల్లి వెంకటయ్య, జై భారత్ మహిళా కమిటి కన్వీనర్ హసీనా, షహనాజ్, ఆర్ పి ఐ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రమేష్ చందర్, సామాజిక ఉద్యమకారులు కైలాసం, జనార్దన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని భూగర్భగనులు నూటికి నూరు శాతం ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించాల్సిందే

సింగరేణి డైరెక్టర్ పీపీ కే వెంకటేశ్వర్లు

శ్రీరాంపూర్ ఏరియాలో అన్ని గనులు, విభాగాల అధిపతులతో సమీక్షా సమావేశం





మంచిర్యాల, 18, నవంబర్ (ప్రజాజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరం శ్రీరాంపూర్ ఏరియాకు కంపెనీ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం 64 లక్షల 30 వేల టన్నులు సాధించి తీరాల్సిందేనని సింగరేణి డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కే. వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు శ్రీరాంపూర్ ఏరియా పర్యటనలో భాగంగా జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో అన్ని గనుల ఏజెంట్లు, ప్రాజెక్టు ఆఫీసర్లు మేనేజర్లు గ్రూప్ ఇంజనీర్లు, ఇంజనీర్ల వివిధ విభాగాల అధికారులతో జీఎం మునిగంటి శ్రీనివాస్ సమక్షంలో సమీక్షా సమావేశంను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గనుల వారీగా ఉత్పత్తి ఉత్పాదకత లకు సంబందించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఈ సారి శ్రీరాంపూర్ ఏరియా వ్యాప్తంగా ఉన్న భూగర్భగనులు వంద శాతం ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించాలని ఆదేశించారు. ఉపరితల గనులు సైతం ఉత్పత్తి పరంగా మరింత మెరుగ్గా రాణించాల్సిన అవసరం ఉందన్నారు. భూ గర్భ గనులు,ఉపరితల గనులకు కావాలిసిన పనిముట్లు, యంత్రాలు సమకూర్చి ఉత్పత్తి సాధనకు సహకరించాలని సంబందిత విభాగాల అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం బి. కృష్ణ ప్రసాద్, డీజీఎం(పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, ఇంఛార్జి ఏరియా ఇంజనీర్ రామకృష్ణ, ఐకే ఓసీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎ వి రెడ్డి, ఎస్ఆర్పీ ఓసీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ సి ఎచ్. వెంకటేశ్వర్లు, ఆర్కే గ్రూప్ ఏజెంట్ ఎన్. శ్రీధర్, ఎస్ఆర్పీ గ్రూప్ ఏజెంట్ రవికుమార్, డీజీఎం (ఐఈడీ) రాజన్న, డీజీఎం(ఫారెస్ట్) హరినారాయణ, డీజీఎం (వర్క్షాప్) కృష్ణా రెడ్డి, డీజీఎం(స్టోర్స్) మల్లయ్య, సివిల్ హెచ్ ఓడీ రవి కుమార్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సత్యనారాయణ, ఏరియా పర్చేజ్ ఆఫీసర్ చంద్రశేఖర్ , డీవై సీఎంఓ రమేష్ బాబు, ఎస్టేట్స్ మేనేజర్ వరలక్ష్మి, ఏరియా సెక్యురిటీ ఆఫీసర్ హనుమాన్ గౌడ్, అన్ని గనుల మేనేజర్లు, వివిధ విభాగాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు

ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల, 18, నవంబర్ (ప్రజాజ్యోతి): జిల్లాలో వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు తో కలిసి పౌరసరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా శాఖల అధికారులు, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష సమావేశంను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఈ సీజన్‌కు సంబంధించి 289 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించడం జరిగిందని, పి.సి.ఎస్.ఎ.పి. మార్గదర్శకాల ప్రకారం కొనుగోలు కేంద్రాలలో పూర్తి చేయవలసిన 16 ప్రశ్నలకు సంబంధించి ఇప్పటి వరకు 175 కేంద్రాలలో నమోదు పూర్తయిందని, మిగిలిన కేంద్రాలలోనూ వెంటనే ప్రక్రియ పూర్తి చేసి కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సీజన్‌లో జిల్లాలో సుమారు 1 లక్ష 78 వేల 628 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరుగుతాయని అంచనా వేయగా, గోదాములతో సహా జిల్లాలో మొత్తం 1 లక్ష 74 వేల 550 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం అందుబాటులో ఉందని, ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన గన్నీ సంచులు, టార్పాలిన్లు, ప్యాడీ






డ్రైయర్లు, ఆటోమేటెడ్ ప్యాడీ క్లీనర్లు, తేమ శాతం కొలిచే యంత్రాలు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, కాలిపర్స్, హస్క్ రిమూవర్లు తదితర అన్ని మౌలిక సదుపాయాలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, ధాన్యం నిల్వలకు తగిన ఏర్పాట్లు ఉన్నాయని తెలిపారు. ధాన్యం మిల్లింగ్ కోసం జిల్లాలో 33 రైస్ మిల్లులను గుర్తించడం జరిగిందని, వీటిలో 14 బాయిల్డ్ రైస్ మిల్లులు, 19 రా రైస్ మిల్లులు ఉన్నాయని, వీటి మొత్తం మిల్లింగ్ సామర్థ్యం 1 లక్ష 46 వేల 750 మెట్రిక్ టన్నులుగా ఉందని తెలిపారు. ఇంకా బ్యాంకు గ్యారంటీలు సమర్పించని రైస్ మిల్లర్లు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ఎల్నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రాబోయే యాసంగి సీజన్‌లో వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించేలా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. బహిరంగ మార్కెట్‌లో సన్నబియ్యం ధరలను నియంత్రణలో ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వేణుగోపాల్, జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, ఎల్‌డిఎం తిరుపతి, సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలలుగా ఫిర్యాదులు చేసినా పట్టించుకోరా....?

గర్మిళ్ల శివారు జాఫర్ నగర్ మురుగునీటి సమస్యపై అధికారుల నిర్లక్ష్యం సహజ మురుగునీటి కాలువను పునరుద్ధరించాలి

జాయింట్ సర్వే పూర్తయ్యే వరకు భూ హద్దులపై స్పష్టత ఇవ్వాలి ఏఐఎంఐఎం మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రెటరీ సయ్యద్ ఇబ్నీ అఫ్ఫాన్



మంచిర్యాల, 18, నవంబర్ (ప్రజాజ్యోతి): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గర్మిళ్ల శివారు జాఫర్ నగర్‌లో నెలకొన్న మురుగునీటి పారుదల సమస్యపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఏఐఎంఐఎం మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రెటరీ సయ్యద్ ఇబ్నీ అఫ్ఫాన్ డిమాండ్ చేశారు. జాఫర్ నగర్ సర్వే నంబర్ 96/1లో గత కొన్నేళ్లుగా పలువురు భూములు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారని, ఆయా ఇళ్ల నుంచి వెలువడే మురుగునీరు, వర్షపు నీరు గతంలో మంచిర్యాల శివారు సర్వే నంబర్ 405 మీదుగా సహజసిద్ధంగా ప్రవహించి రామచెరువులో కలిసేదని తెలిపారు. అయితే ఇటీవల సర్వే నంబర్ 405లో డీటీసీపీ లేఅవుట్ ఏర్పాటు చేసి ప్లాట్లు విక్రయించే క్రమంలో సర్వే నంబర్ 96/1 నుంచి వచ్చే మురుగునీటి కాలువతో పాటు వర్షపు నీటి సహజ ప్రవాహ మార్గాన్ని మట్టితో మూసివేసినట్లు ఆరోపించారు. దీంతో జాఫర్ నగర్‌లోని ఇళ్ల నుంచి వెలువడే మురుగునీరు బయటకు వెళ్లే మార్గం లేక డ్రైనేజీ కాలువల్లోనే నిలిచిపోతోందని, దుర్వాసన, దోమల బెడదతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రజారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు . ఈ సమస్యపై గత మూడు నెలలుగా జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు పరిష్కారం లభించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అధికారులు సహకరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. అంతేకాకుండా సర్వే నంబర్లు 96/1, 405లకు సంబంధించి భూ హద్దులు, రహదారి హక్కులు, భూ రికార్డులపై రెవెన్యూ అధికారులు తక్షణమే జాయింట్ సర్వే నిర్వహించి వాస్తవాలను నిర్ధారించాలని, సర్వే పూర్తయ్యే వరకు చట్టపరమైన హక్కులను పరిశీలించి సర్వే నంబర్ 96/1 భూమిపై రాకపోకల విషయంలో తగిన తాత్కాలిక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మట్టితో మూసివేసిన పాత మురుగునీటి కాలువను వెంటనే పునరుద్ధరించాలని, రామచెరువులోకి వెళ్లే వర్షపు నీటి సహజ ప్రవాహ మార్గాన్ని తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని, స్థానికులకు శాశ్వత డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాథమిక సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదని, పేద, మధ్యతరగతి కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని సయ్యద్ ఇబ్నీ అఫ్ఫాన్ కోరారు. లేనిపక్షంలో ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం పోరాడుతామని స్పష్టం చేశారు.

నెడు పంచముఖ ఆంజనేయ 12వ మాసోత్సవం



ఖానాపూర్ నవంబర్ 18(ప్రజా జ్యోతి) నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని పంచముఖ హనుమాన్ జంక్షన్ చౌరస్తాలో గల సంకట మోచన పంచముఖ హనుమాన్ 12వ మాసోత్సవం నెడు 19 గురువారం ఆంజనేయ స్వామి జన్మనక్షత్రం పూర్వాభాద్ర సందర్భంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రకటనలో తెలిపారు. ఆలయం లో ప్రతిష్ట సమయములో సంవత్సరం వరకు ప్రతి నెల మాసోత్సవం అనే మహ సంకల్పము చే నెడు చివరి మాసోత్సవం గురువారం పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం లో చివరి 12 వ మాసోత్సవం జరుగుతుందని ఇందులో భాగంగా స్వామి వారికి ఉదయం 9:00 గం “లకు గణపతి పూజ 9:30 గం “లకు పంచామృత అభిషేకం అనంతరం విశేష అష్టోత్తర శతనామ అర్చనా కార్యక్రమం హనుమాన్ చాలీసా పారాయణం అనంతరం హారతి , 10:00గం” లకు ఆంజనేయ స్వామి వారి విశేష మూల మంత్ర హోమము నిర్వహించి తరువాత 11 గం” : 30ని “ లకు నైవేద్యం, హారతి మంత్రపుష్పం తీర్థ ప్రసాద వితరణ మధ్యాహ్నం 12: 00గం “ లకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అల్లాడి వెంకటేశ్వర్లు తోట హనుమంతు తుమ్మనపల్లి లక్ష్మణ్ చూపు రాజేశ్వర్ ఎడ్ల రాజేశ్వర్ భవాని రాజేశ్వర్ సింగ్ ప్రవీణ్ కుమార్ తెలిపారు భక్తులు ఇట్టి కార్యక్రమం లో పాల్గొని ఆ పంచముఖ ఆంజనేయ స్వామి వారి అనుగ్రహ కృపా కటాక్షాలు పొందాలని కోరారు

సోనాల మండలంలో ఘనంగా కొత్త పెన్షన్ల పంపిణీ కార్యక్రమం



సోనాల, నవంబర్ 18 (ప్రజాజ్యోతి): సోనాల మండల కేంద్రంలో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే అనిల్ జాదవ్, గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య ల చేతుల మీదుగా అత్యంత ఘనంగా మరియు పండుగ వాతావరణంలో నిర్వహించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో, లబ్ధిదారులకు నూతన పింఛన్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి మండలంలోని పలువురు ప్రముఖులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పంచాయతీ రాజ్ రెవెన్యూ శాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హులైన పేదలకు, వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు అండగా నిలిచేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కొత్తగా పింఛన్ల మంజూరు కావడంతో లబ్ధిదారుల ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రాజు యాదవ్, మండల ప్రత్యేక అధికారి నర్సమ్మ, ఎమ్మార్వో మల్లేష్, ఎంపీడీవో రత్నాకర్ రావు, సర్పంచ్ బిందుజా సుధీర్ రెడ్డి, డిసిసి కార్యదర్శి లోలపు పోశెట్టి, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, సర్పంచుల సంఘం అధ్యక్షులు చౌహాన్ వినోద్ సింగ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గుడాల అనీష్, మార్కెట్ డైరెక్టర్లు జుంగాల భోజన్న, మునేశ్వర సోమన్న, సర్పంచులు, నాయకులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో ఎలాంటి లోపాలు ఉండకూడదు

అర్హులందరికీ వీబీ-జి రామ్ జీ పథకం కింద 125 రోజుల పని కల్పించాలి

నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను గడువులోగా పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రతినిధి ,నవంబర్ 18 ,(ప్రజాజ్యోతి) ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనం అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం, వీబీ-జి రామ్ జీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు శిబిరాల్లో ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కుటుంబ సభ్యులు, నామినీ వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని, నామినీ మైనర్ అయిన పక్షంలో అపాయింటీ వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. శిబిరాల నిర్వహణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పథకాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు.వీబీ-జి రామ్ జీ పథకం కింద అర్హులైన ప్రతి ఒక్కరికీ ఏడాదిలో 125 రోజుల ఉపాధి కల్పించేలా



అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు ఉపాధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించి, పనులు కోరుకునే వారందరికీ ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలిపారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున సోక్‌పిట్‌ల నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందిస్తూ నిర్మాణ పనుల్లో పురోగతి సాధించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లను పీఎంఏవై పథకంతో అనుసంధానించే ప్రక్రియను వేగవంతం చేయాలని, సాంకేతికపరమైన సమస్యలు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు.



ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 గోడప్రతుల ఆవిష్కరణ


అనంతరం ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 ప్రచార గోడప్రతులను జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఇతర అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌పై జిల్లాలో విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేలా గ్రామీణ ప్రాంతాల వరకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, వెంకట మాధవ రావు, డీఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా దరఖాస్తుల స్వీకరణ పకడ్బందీగా చేపట్టాలి

గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి

ఆసిఫాబాద్, నవంబర్ 18 ప్రజా జ్యోతి రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ఈ పథకం కింద ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ సచివాలయం నుంచి సంబంధిత శాఖల కార్యదర్శులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19న ముఖ్యమంత్రి చేతుల మీదుగా పథకం ప్రారంభం కానుందని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ కోసం ప్రతి గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. తెలంగాణలో జన్మించి ఆధార్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ పథకానికి అర్హులని వెల్లడించారు.జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ కె.హరిత, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్



మాట్లాడుతూ జిల్లాలో పథకం అమలుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించడంతో పాటు టామ్‌టామ్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్‌లో వివరాల నమోదు



ప్రక్రియను నోడల్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి కుటుంబం దరఖాస్తు చేసుకునేలా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంవత్సరాలు గడుస్తున్న పూర్తికాని పశువుల ఆసుపత్రి

పట్టించుకోని స్థానిక నాయకత్వం అధికారులు కార్ల అడ్డగా మారిన తీరు



ఖానాపూర్ నవంబర్ 18 (ప్రజా జ్యోతి) నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో గల పశువుల ఆస్పత్రి శిథిలావస్థకు చేరుకోగా గత ప్రభుత్వంలో ఐదు సంవత్సరాలు క్రితం పనులు ప్రారంభించిన ఇప్పటికీ పూర్తి కావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇది మనం పట్ల స్థానిక నాయకత్వం గానీ అధికారులు పట్టించు కోవడంలేదని విమర్శిస్తున్నారు విద్యానగర్ నడి బొడ్డులొ పశు వులకు రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో గల ఆసుపత్రి నిర్మాణం పూర్తి కాకపోవడంతో టెంపరరీగా ఎలాంటి సౌకర్యాలు లేని స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయ ప్రాంగణంలో పశువుల చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేశారు దీంతో సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు తెలిపారు పాత స్థలంలోనే నిర్మాణం 70 శాతం జరిగి దానికి సంబంధించిన దర్వాజలు కిటికీల తోపాటు కాంపౌండ్ వాల్ నిర్మించి ఫ్లోరింగ్ విద్యుత్తు కలర్ వేయాల్సి ఉంది అయితే ఈ పని మద్యంతరంగా ఎందుకు ఆగిపోయిందో అంత పట్టడం లేదు గత ఐదేళ్లుగా నిర్మాణం పూర్తికాక స్లాబేసి ఉండడంతో రాత్రిళ్ళు అక్కడ మందు ప్రియులు మద్యం సేవిస్తున్నా రని ఆరోపణలు ఉన్నాయి దీనికి తోడు ఉదయం నుంచి సాయంత్రం వరకు కిరాయి కార్ల అడ్డాగా కొనసాగుతోంది ఇప్పటికైనా ఈ ఆసుపత్రి నిర్మాణం పూర్తిచేసి పశుసంవర్తక శాఖ అధికారులకు అందించి పశు చికిత్స సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే వెడమ బొజ్జు తో పాటు సంబంధిత పశుసంవర్ధక జిల్లా అధికారులు జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా చొరవ తీసుకోవాలని కోరుతున్నారు

వి.బి.జి. రామ్‌జీ పథకంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

పనులు చేయకుండానే నిధులు కాజేసినట్లు ఫిర్యాదు.. రికార్డుల పరిశీలనలో వెల్లడి

సిబ్బంది ఎవరినీ ఉపేక్షించేది లేదు: కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్ , నవంబర్ 18 ప్రజా జ్యోతి వి.బి.జి. రామ్‌జీ పథకంలో అక్రమాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె.హరిత హెచ్చరించారు. బుధవారం కెరమెరి మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.పథకంలో నిధుల దుర్వినియోగం జరుగుతోందని అందిన ఫిర్యాదుల మేరకు కలెక్టర్ కార్యాలయం లోని రికార్డులు, మస్టర్ రోల్స్, ఎం.బి. బుక్కులను పరిశీలించారు. సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, మేట్లు కుమ్మక్కై పనులు చేపట్టకపోయినా, కూలీలు హాజరు కాకపోయినా హాజరైనట్లు నమోదు చేసి నిధులు స్వాహా చేసినట్లు పరిశీలనలో గుర్తించారు.ఈ వ్యవహారంపై కలెక్టర్ సంబంధిత సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాల నిధులను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ తనిఖీలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నవంబర్ 30 వరకు ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు

-ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ నాగుల అశోక్



సోనాల, నవంబర్ 18 (ప్రజాజ్యోతి): సోనాల మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బుధవారం రోజు ?ఓపెన్ స్కూల్ ద్వారా పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ కోర్సులలో ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులకు నవంబర్ 30వ తేదీ వరకు ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు గడువు ఉందని జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ నాగుల అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా ఓపెన్ పదవ తరగతి మరియు ఇంటర్‌కు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. అడ్మిషన్ల కోసం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోనాలలో అసిస్టెంట్ కోఆర్డినేటర్ ఓస శ్రీనివాస్‌ను సంప్రదించాలని తెలిపారు.

కాంగ్రెస్‌లోకి సామాజిక కార్యకర్త ఎన్.టి. రమణ

--- బోథ్ ఇంచార్జి ఆడే గజేందర్ సమక్షంలో పార్టీలోకి చేరిక



నేరడిగొండ, నవంబర్ 18(ప్రజాజ్యోతి): మండలంలోని కుమారి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త, 'చేయూత ఫౌండేషన్' చైర్మన్ ఎన్.టి. రమణ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బోథ్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ ఆధ్వర్యంలో ఆయన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ రమణకు పార్టీ కండువా కప్పి సాదరంగా కాంగ్రెస్ కుటుంబం లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గజేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందని తెలిపారు. ప్రజాసేవ చేయాలనే ఉద్దేశంతో పార్టీలోకి వచ్చే ప్రతి కార్యకర్తకు మరియు నాయకునికి సముచిత గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కుమారి పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేష్, బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సాబ్లే కైలాష్, నారాయణ, నేరడిగొండ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు సురేష్, మండల ప్రధాన కార్యదర్శి మహి పాల్ సింగ్, సీనియర్ నాయకులు మురళి గౌడ్, బుక రాములు, మౌలానా, ఎండీ సద్దాం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ జిల్లా దిశా కమి టీ సభ్యుల నియామకం



ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 18,(ప్రజా జ్యోతి) ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణకమి టీ (దిశ)దిశ కమిటీ సబ్యు ల నియామకం ప్రక్రియ ను ఎట్టకేలకు పూర్తి చేశారు.ఎం పీ చైర్మన్ గా వ్యవహారిం చే ఈ కమిటీలో నలుగురు స భ్యులను చైర్మన్ (ఎంపి) ఆ మోదం తో కేంద్ర ప్రభుత్వం కు ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుంది. జిల్లాలోని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ బిజెపిలో సీనియర్ నాయకులు నలుగురిని నామినేట్ చేస్తూ ఎంపీ గోడం నగేష్ కేంద్ర ప్రభుత్వంకు నివేదించారు. అం దులో సభ్యులుగా సోనాల మండల బిజెపి సీనియర్ నాయకులు, మాజీ రైల్వే బోర్డు మెంబర్ గాండ్ల వెంక టరమణ, గుడిహత్నూర్ మండలం లింగాపూర్ గ్రా మానికి చెందిన వాగ్మారే శై లేందర్ ప్రస్తుతము సంజయ్ నగర్ నివాసి మాజీ కౌన్సి లర్,గుడిహత్నూర్ మండల్ కేంద్రానికి చెందిన సీనియర్ బిజెపి సీనియర్ నాయకు డైన గిత్తే వామన్ పటేల్‌ను కేంద్ర ప్రభుత్వం మంత్రిత్వ శాఖ ద్వారా జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సభ్యు లుగాని యమించినందుకు నియా మకమైన గాండ్ల వెంకటర మణ వాగ్మారీ శైలేందర్ గిత్త వామన్ పటేల్ ఆదిలాబాద్ పార్ల మెంట్ సభ్యులు జి నగే ష్ ఆదిలాబాద్ ఎమ్మెల్యే పా యల శంకర్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని పకడిబందీగా అమలు చేయాలి

బోరజ్ తహసీల్దార్ రాథోడ్ బాబు సింగ్



బోరజ్, నవంబర్ 18,(ప్రజా జ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 19న ప్రారం భించనున్న ఇందిరమ్మ కు టుంబ భీమా పథకాన్ని క్షేత్ర స్థాయిలో పకడిబందిగా అమలు చేయాలని బోరజ్ మండల తహసిల్దార్ రాథోడ్ బాబు సింగ్ అధికారులైన సుపర్ వేజర్లను పంచాయతీ కార్యదర్శులను కోరారు. బుధవారం మధ్యాహ్నం బోరజ మండలం కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరమ్మ కుటుంబ భీమా పథకం పరివేక్షణ కోసం నియామకమైన ఎంపీడీవో, ఎంపీఓ, ఏపీఎం, ఏపీవో,గ్రా మస్థాయి అధికారులైన పం చాయతీ కార్యదర్శులతో కంప్యూటర్ ఆపరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ ఒక్కరోజు ముందుగా గ్రామంలో సర్పంచ్‌లు, పం చాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్లు, బీడీసీ కమిటీలు, మహిళా సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు ఉద్దేశాన్ని వివరించాలని, అప్పుడే గ్రామంలో ని ప్రతి ఒక్కరికి బీమా పథకం పై అవగాహన కలుగు తుందని అన్నారు. రాష్ట్ర ప్ర భుత్వం మార్గదర్శక ప్రకారం ప్రతి కుటుంబంలో అర్హులైన 18 నుంచి 59 సంవత్సరా లలోపు ఉండి కుటుంబాన్ని పోషించే వ్యక్తి పేరును భీ మా పథకంలో నమోదు చేసి అయినా చెప్పిన విధంగా నామిని ఎవరి పేరు చెప్తే వారిని నామినేగా నమోదు చేయాలని అన్నారు. ఒక కుటుంబంలో ముగ్గురి నామి నేళ్లు వస్తే ముగ్గురు పేరుని కూడా నామినే కింద నమోదు చేయాలని అన్నారు. పేర్లు నమోదులు నామిని టా టా ఎంట్రీలో ఎటువంటి తప్పులు జరగకుండా ఒకటికి రెండుసార్లు పంచాయతీ కార్యదర్శులు జిపి అధికారి ఒకటికి రెండుసార్లు సరిచూ సుకోవాలని. తప్పులు ఏమై నా జరిగితే సంబంధిత అధి కారులే బాధ్యులు అవుతార ని అన్నారు. ఎటువంటి తప్పులు జరగకుండా ప్రశాంత వాతావరణం లో ప్రతి గ్రామ పంచాయతీలో అర్హులైన ప్రతి కుటుంబం నుంచి ఒకరిని ఇందిరా కుటుంబ జీవితమే మో నమోదు చేయాలని అన్నారు. ఈ ప్రత్యక్ష సమావే శంలో బోరజ్ ఎంపీడీవో ఉమ్మడి నారాయణ ఎంపీ ఓ రమేష్ సెర్ప్ ఏపీఎం మాధవ్,బి బి జి రాంజీ ఈసీ వినోద్, హౌసింగ్ ఏఈ మీ సేవ సేవకుడు సర్వేశ్వర్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శులు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులు ప్రజాస్వామ్య బలోపేతానికి కృషి చేయాలి



మాజీ మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య.

లక్షెటిపేట, నవంబర్ 18, (ప్రజాజ్యోతి):ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య జర్నలిస్టులు వారధులుగా పనిచేస్తున్నారని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ముఖ్య సలహాదారు, మాజీ మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య, జిల్లా అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వర్లు కొనియాడారు. జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం రాత్రి స్థానిక ఆర్యవైశ్య భవన్‌లో పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సుమారు 30 మంది పాత్రికేయులను శాలువాలతో సత్కరించారు. ?ముఖ్య అతిథులుగా హాజరైన కాంతయ్య, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సమాజంలోని అన్యాయాలను, ప్రభుత్వ పథకాల అమలులో లోపాలను నిర్భయంగా అధికారుల దృష్టికి తీసుకెళ్తూ ప్రజాస్వామ్య బలోపేతానికి జర్నలిస్టులు కృషి చేస్తున్నారని తెలిపారు. వృత్తిపరమైన నిబద్ధతతో పాటు పాత్రికేయులు తమ సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం మహిళా సంఘం అధ్యక్షురాలు నరేందుల సాహితి మాట్లాడుతూ.. ఎండనకా, వాననకా ప్రజలకు వాస్తవాలను చేరవేస్తున్న జర్నలిస్టుల సేవలను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. బాధితుల పక్షాన నిలిచి పేదలకు పాత్రికేయులు ఎంతో మేలు చేస్తున్నారని ఐక్య వ్యాపార సంఘం అధ్యక్షుడు మైలారపు సుధాకర్ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బోనగిరి కుమార్, సీనియర్ జర్నలిస్టులు తమ వృత్తిపరమైన అనుభవాలను పంచుకుంటూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి పల్లెర్ల ఆరతి, కోశాధికారి కాసం స్వప్న, సలహాదారులు ఉత్తూరు రజిత, చెట్ల రమ్య, ఆర్యవైశ్య సంఘం పట్టణ, మండల, యువజన విభాగాల నాయకులు చెట్ల రమేష్, నల్మాస్ శ్రీనివాస్, ఓజ్జల శ్రీనివాస్, నరేందుల రమేష్, గౌరిశెట్టి శ్రీనివాస్, కొంజర్ల ప్రసాద్, కొంజర్ల శ్రీనివాస్, గడ్డం వికాస్, రంజిత్, బొద్దుకూరి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



ఆసిఫాబాద్, నవంబర్ 18 ప్రజా జ్యోతి అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం రిలీఫ్ ఫండ్) అండగా నిలుస్తోందని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. బుధవారం ఆసిఫాబాద్ మండలంలోని చోర్‌పల్లి, కొత్తర హపల్లి గ్రామాలకు చెందిన బాధితులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు.చోర్‌పల్లి గ్రామానికి చెందిన గజ్జెల కార్తీక్‌కు రూ.60,500, కొత్తరహపల్లి గ్రామానికి చెందిన సెండే సంపత్‌కు రూ.28 వేల విలువైన చెక్కులను అంద జేశారు. ఈ సందర్భంగా ఆత్రం సక్కు మాట్లాడుతూ పేదల సంక్షే మమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అనారో గ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ఆసుపత్రి ఖర్చుల కోసం సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందించడం అభినంద నీయమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్ర మంలో మాజీ ఎంపీపీ బొమ్మన భాలేష్ గౌడ్, ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చిట్ల నారాయణ, కాంగ్రెస్ నాయకులు మేకర్తి శ్రీనివాస్, పిడుగు తిరుపతి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందించడమే లక్ష్యం

నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం



ఆసిఫాబాద్, నవంబర్ 18 ప్రజా జ్యోతి అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని గుండి గ్రామ మాజీ సర్పంచ్ సెండే దత్తు అన్నారు. ఆసిఫాబాద్ మండలంలోని గుండి గ్రామంలో బుధవారం నిర్వహించిన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఇరుకుళ్ల మంగ హాజరై లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సెండే దత్తు మాట్లాడుతూ నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన వారందరికీ పింఛన్లు అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి తిరుసుల్లా సత్తయ్య, ప్రవీణ్ చారి, శ్యాంరావు, విశ్వనాథ్, కమలాకర్ చారి, సర్పంచ్ జబరి రవీందర్, ఉపసర్పంచ్ సంతోష్, కార్యదర్శి హరీష్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గనులు, భూగర్భ శాఖ సహాయ సంచాలకులుగా తిరుపతి రావు బాధ్యతల స్వీకరణ



ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 18, జిల్లా గనులు, భూగర్భ శాఖ సహాయ సంచాలకులుగా ఏం. తిరుపతి రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కలెక్ట రేట్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అంజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నూతన సహాయ సంచాలకులకు శుభాకాంక్షలు తెలిపారు. గనులు, భూగర్భ శాఖ కార్యకలాపాలను సమర్థ వంతంగా, పా రదర్శ కంగా నిర్వహిస్తూ ప్ర భుత్వ నిభంధన లను ప క్కాగా అలు చేయాలని సూచించారు.ఈ కార్యసక్రశమంలో రాయల్టీ ఇన్ స్పెక్టర్ రమేష్ పవర్ తదిత రులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే ఓటు హక్కు ప్రాముఖ్యత తెలుసుకోవాలి

జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు.

నిర్మల్ జిల్లా ప్రతినిధి ,నవంబర్ 18 ,(ప్రజాజ్యోతి) విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు ప్రాముఖ్యత తెలుసుకోవాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఓటర్ల అవగాహన కోసం ఎస్ఐఆర్ కు సంబంధించి జిల్లా స్థాయి ఈఎల్ సి (ఎలక్టోరల్ లిటరసీ క్లబ్) పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట మాధవ రావుతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, భారత దేశంలో పౌరులకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు అనేది వజ్రాయుధంలాంటిదని తెలిపారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కు ప్రాముఖ్యత తెలుసుకొని సమాజంలో ప్రజలను చైతన్యపరచాలని అన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కు వినియోగించుకునే స్వేచ్ఛ మన దేశంలో ఉందని వివరించారు. క్విజ్, వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట మాధవ రావు మాట్లాడుతూ, ఓటు హక్కు ఎంతో విలువైనదని అన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా ప్రతిభ చాటి జిల్లా పేరు నిలపాలని ఆకాంక్షించారు.అనంతరం ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులను నియోజకవర్గ బృందాలుగా విభజించి, భారత ఎన్నికల వ్యవస్థ, ఎస్ఐఆర్, తదితర అంశాలపై క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీలలో ఖానాపూర్ నియోజకవర్గ బృందం విజయం సాధించింది. విజయం సాధించిన విద్యార్థులను అధికారులు అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు చెప్పారు. ఈ పోటీలు ఎంతో ఉత్సాహంగా జరిగాయి.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు స్వాతి, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాజ్యోతి వార్తకు స్పందన.. బెజ్జూర్--హైదరాబాద్‌కు బస్సు సర్వీసు ప్రారంభం

హర్షం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు


బెజ్జూర్ 18 నవంబర్: ప్రజాజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. బెజ్జూర్ మండల ప్రజల ప్రయాణ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బెజ్జూర్ నుంచి హైదరాబాద్‌కు బస్సు సర్వీసును ప్రారంభించారు. గతంలో హైదరాబాద్‌కు వెళ్లేందుకు సరైన బస్సు సౌకర్యం లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ సమస్యను ప్రజాజ్యోతి పత్రిక వెలుగులోకి తీసుకురావడంతో బస్సు సర్వీసు ప్రారంభించడం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బస్సు సర్వీసు అందుబాటులోకి రావడంతో హైదరాబాద్‌కు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, ఇతర ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం కలగనుంది. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన ప్రజాజ్యోతి పత్రికకు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

బోథ్ గురుకుల పాఠశాలకు నూతన ప్రిన్సిపల్



బోథ్, నవంబర్ 18 (ప్రజా జ్యోతి) మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికలపాఠశాలకు నూతన ఇంచార్జ్ ప్రిన్సిపల్‌గా బి.లత బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ లత మాట్లాడుతూ ఈప్రాంత బిడ్డగా బోథ్ గురుకులంనురాష్ట్రలోనే గుర్తింపు పొందేలా కృషి చేస్తానని తెలిపారు.

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా లింగంపల్లి మహేష్



మంచిర్యాల/చెన్నూర్ , 18, నవంబర్ (ప్రజాజ్యోతి): చెన్నూరు పట్టణానికి చెందిన లింగంపల్లి మహేష్ ను కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ, దానిపై ఎంతో నమ్మకంతో పట్టణ అధ్యక్షుడిగా పదవి కల్పించిన స్థానిక మంత్రి వివేక వెంకట్ స్వామికి ఎంపీ వంశీకృష్ణకు కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ మరియు రాష్ట్ర కమిటీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

నాణ్యమైన దర్యాప్తుతో నేరస్తులకు శిక్ష పడేలా చూడాలి

నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ నితికా పంత్



ఆసిఫాబాద్, నవంబర్ 18 ప్రజా జ్యోతి జిల్లాలో పెండింగ్ కేసులను త్వరి తగతిన పరిష్కరించి బాధి తులకున్యాయం అందిం చాలని ఎస్పీ నితికా పంత్ పోలీసు అధికా రులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాల యంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి నేరస్తులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు.మహిళలు, చిన్నారులపై నేరాలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, తీవ్రమైన నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బెట్టింగ్, జూదం, మట్కా, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహిస్తూ డయల్ 112 ఫిర్యాదులకు త్వరగా స్పందించాలని ఆదేశించారు.ప్రజలు, వ్యాపారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రాపర్టీ కేసుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి చోరీ సొత్తును రికవరీ చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్‌స్పాట్లను గుర్తించి చర్యలు చేపట్టాలని, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో నాకాబందీ, కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ చిత్తరంజన్, డీఎస్పీలు అశోక్, వాహీదుద్దీన్, సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రూ.90 లక్షలతో బీటీ రహదారి పునరుద్ధరణ

సంకారం పాఠశాలలో విద్యార్థులకు బెంచీల పంపిణీ..

మెరుగైన వసతులు కల్పించాలని అధికారులకు సూచన



చెన్నూరు: మండలంలోని కన్యేపల్లి నుంచి సంకారం వరకు రూ.90 లక్షల ఎం.ఆర్.ఆర్. 2024--25 నిధులతో పునరుద్ధరించిన బీటీ రహదారిని ప్రారంభించారు. అనంతరం సంకారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అవసరమైన బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు, అవసరమైన మౌలిక వసతులను సమకూర్చాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఆకలిని దూరం చేస్తేనే చదువుపై ఏకాగ్రత!

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు అల్పాహార పథకం ఎంతో దోహదం

మోడల్ స్కూల్‌లో బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించిన మంత్రి వివేక్ వెంకటస్వామి

డైనింగ్ హాల్ నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చదవాలి

చెన్నూరు నియోజకవర్గం, నవంబర్ 18 (ప్రజాజ్యోతి): పేదరికం కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించి, వారిలో చదువుపై ఆసక్తి, ఏకాగ్రత పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహార పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కోటపల్లి మండలంలోని మోడల్ స్కూల్‌లో మంగళవారం ఆయన బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉదయం అల్పాహారం తీసుకోకుండానే పాఠశాలలకు వచ్చే పేద విద్యార్థులకు ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కడుపునిండా పౌష్టికాహారం తీసుకుంటేనే విద్యార్థులు తరగతి గదుల్లో చురుకుగా ఉండి పాఠాలపై దృష్టి సారించగలరని చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యా ప్రమాణాల మెరుగుదలతో పాటు పాఠశాలల్లో హాజరు శాతం పెంపునకు ఈ పథకం దోహదపడుతుందని వివరించారు.

విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం

2009లో తాను ఎంపీగా ఉన్న సమయంలోనే మోడల్ పాఠశాలల ఏర్పాటుకు కృషి చేశానని మంత్రి గుర్తుచేశారు. విద్యార్థులు చిన్నతనం నుంచే జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించేందుకు క్రమశిక్షణతో కష్టపడి చదవాలని సూచించారు.



పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించే విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేస్తానని ప్రకటించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంలో భాగంగా మోడల్ స్కూల్‌లో డైనింగ్ హాల్ నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. చెన్నూరు నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. చెన్నూరు మండలం సోమనపల్లి గ్రామంలో సమీకృత పాఠశాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

యువతకు నైపుణ్య శిక్షణ

తెలంగాణలో విద్యార్థుల సంక్షేమం, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా యువతకు



ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణ అందిస్తూ ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అనంతరం మంత్రి విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. పాఠశాలలో అందిస్తున్న ఆహార నాణ్యత, మెనూ వివరాలను ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని సూచించారు.

యువతలోని ప్రతిభకు యువజన ఉత్సవాలు చక్కని వేదిక



రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి ఆదిలాబాద్‌కు గుర్తింపు తీసుకురావాలి

జిల్లా స్థాయి యువజన ఉ త్సవాలను ప్రారంభించిన ఎంపీ గోడం నగేష్, కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 18,(ప్రజా జ్యోతి) ఆదిలాబాద్ యువతలో దాగి ఉన్న సృజనాత్మకత, కళానైపుణ్యాలను వెలికి తీసేం దుకు యువజనఉత్సవాలు ఎంతగానో దోహద పడతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతూ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎంపీ గోడం నగేష్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను ఎంపీ గోడం నగే ష్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, జిల్లా కలె క్టర్ రాజర్షి షా జ్యోతి ప్రజ్వ లన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ యువత పోటీతత్వాన్ని అలవర్చుకుని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగినప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిం చగలరని అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు కళలు,



నృత్యాలకు ఎంతో ప్రాచీన చరిత్ర ఉందని, పురాతన దేవాలయాల్లోని శిల్పకళ లోనూ మన పూర్వీకుల కళా వైభవం, నృత్యరీతులు ప్రతిబిం బిస్తాయని వివరించారు. గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడు తూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. పోటీల్లో పాల్గొ నేటప్పుడు అందుబాటులో ఉన్న సమయాన్ని సమర్థ వంతంగా వినియోగించు కుని తమలోని ప్రతిభను సంపూర్ణంగా ప్రదర్శించాలని సూచించారు. 1998లో ఆ దిలాబాద్‌లో జాతీయ స్థా యి యువజన ఉత్సవాలు నిర్వహించిన విషయాన్ని గుర్తుచేస్తూ, ప్రస్తుత ఉత్స వాల్లో పాల్గొంటున్న యువ తీయువకులు జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థా యిల వరకు విజేతలుగా నిలిచి అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ యువతలోని ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించడం తోపాటు వారిలో సృజనాత్మకతను పెంపొందించేం దుకు యువజన ఉత్సవాలను నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. వీధి నాటకాలు, జానపద గీతాలు, నృత్యాలు,



వ్యాస రచన, చిత్రలేఖనం, కవితారచన తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి విజేత లుగా నిలిచిన వారికి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. బాలికలు వివిధ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని, బాలురు సైతం అన్ని రంగాల్లో తమ నైపుణ్యాలను ప్రదర్శించాలని సూచించారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకో వాలని అన్నారు. యువత నైపుణ్యాభివృద్ధికి స్టెప్ ద్వారా అవసరమైన శిక్షణ కార్యక్రమాలను అందిస్తున్నామని తెలిపారు. అనంతరం యువతీయువకులు ప్రదర్శించిన వివిధ కళారూపాలు, నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీఈఓ స్టెప్ సతీష్, పోటీల న్యాయ నిర్ణేతలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, యువతీయువకులు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలి

విద్యార్థులకు మంత్రి గడ్డం వివేకానంద పిలుపు

మోడల్ స్కూల్‌లో సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం

ప్రారంభం.. రూ.40 లక్షలతో భోజనశాల నిర్మాణం



చెన్నూరు నియోజకవర్గం, నవంబర్ 18 (ప్రజాజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడే తత్వాన్ని అలవర్చుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద పిలుపునిచ్చారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, హాజరు శాతం, ఏకాగ్రతను పెంపొందించడంతో పాటు వారికి పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. బుధవారం కోటపల్లి మండలంలోని మోడల్ స్కూల్‌లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి మంత్రి సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఉదయం అల్పాహారం తీసుకోకుండా పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు ఈ పథకం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20 లక్షల మంది విద్యార్థులకు, మంచిర్యాల జిల్లాలో 35 వేల మందికి, చెన్నూరు నియోజకవర్గంలో 12 వేల మందికి ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరనుందని తెలిపారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల విద్యార్థులు రోజంతా ఉత్సాహంగా చదువుకోవడంతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారని అన్నారు.

లక్ష్యంతో చదివితేనే ఉన్నత శిఖరాలు

విద్యార్థులు భవిష్యత్తులో డాక్టర్లు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా ఎదగాలనే లక్ష్యంతో చదువుకోవాలని మంత్రి సూచించారు. పాఠశాల స్థాయి నుంచే వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, మంచి నడవడికను అలవర్చుకోవాలన్నారు. మోడల్ స్కూల్‌లో ప్రస్తుతం మంచి ఫలితాలు వస్తున్నాయని, ఇకపై వందశాతం ఉత్తీర్ణతతో పాటు అత్యుత్తమ గ్రేడ్లు సాధించేలా విద్యార్థులు కృషి చేయాలని ఆకాంక్షించారు. విద్యార్థులు వందశాతం డిస్టింక్షన్ ఫలితాలు సాధిస్తే పాఠశాలకు ప్రత్యేక బహుమతి అందజేస్తానని ప్రకటించారు.

రూ.40 లక్షలతో భోజనశాల నిర్మాణం

కోటపల్లి మోడల్ స్కూల్‌లో 301 మంది బాలురు, 237 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారని మంత్రి తెలిపారు. సుమారు 500 మంది విద్యార్థులకు ఉపయోగపడేలా భోజనశాల నిర్మాణానికి రూ.40 లక్షలు కేటాయించనున్నట్లు వెల్లడించారు. ఇందులో రూ.20 లక్షలు జిల్లా కలెక్టర్ ద్వారా, మరో రూ.20 లక్షలు డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి సమకూర్చనున్నట్లు వివరించారు. చెన్నూరు నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, డిగ్రీ కళాశాలకు రూ.2 కోట్లు, ఇంటర్మీడియట్ కళాశాలకు రూ.1.50 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కోటపల్లిలో రూ.90 లక్షలతో ఎస్సీ వసతి గృహ నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. సోమనపల్లిలో 2,500 మంది విద్యార్థులకు వసతి కల్పించే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.4 వేల కోట్ల వ్యయంతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తోందని, వీటి ద్వారా విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తాం: కలెక్టర్

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, గురుకులాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు



తీసుకుంటున్నామని తెలిపారు. పాఠశాలల నుంచి వచ్చే ప్రతిపాదనలను పరిశీలించి నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. తాగునీరు, మరమ్మతులు, బోర్‌వెల్స్, ఇతర వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం, డైట్, కాస్మెటిక్ ఛార్జీల పెంపు వంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. ప్రస్తుతం పాఠశాలల్లో సగటు హాజరు 75 శాతానికి పైగా ఉందని, కొన్ని సందర్భాల్లో 80 శాతానికి చేరుతోందని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణ, సానుకూల దృక్పథంతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం మంత్రి, జిల్లా కలెక్టర్ విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించారు. ఆహార నాణ్యత, మెనూ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రయోగశాల గదిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, కోటపల్లి తహసీల్దార్ రాఘవేంద్ర, ఎంపీడీవో నాగేశ్వరరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ తివారి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది లతీఫ్ భట్ హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద వ్యతిరేక పోరులో భద్రతా బలగాలు కీలక విజయాన్ని సాధించాయి. లష్కరే తయ్యిబాకు చెందిన మోస్ట్ వాంటెడ్ కమాండర్ లతీఫ్ భట్‌ను భద్రతా దళాలు హతమార్చాయి. కశ్మీర్‌లో క్రియాశీలంగా ఉన్న చివరి స్థానిక లష్కరే తయ్యిబా ఉగ్రవాదిగా భావిస్తున్న అతడి కోసం భద్రతా సంస్థలు కొంతకాలంగా గాలిస్తున్నాయి. ఇటీవల కుల్గాం జిల్లాలో సీఆర్‌పీఎఫ్ సిబ్బందిపై జరిగిన కాల్పుల ఘటనలో అతడి ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టిన భద్రతా బలగాలు అతడి ఆచూకీని గుర్తించి మట్టుబెట్టాయి.

మసీదులో తలదాచుకున్న ఉగ్రవాది

లతీఫ్ భట్ భద్రతా బలగాల నుంచి తప్పించుకునే క్రమంలో ఓ మసీదులోకి ప్రవేశించినట్లు పోలీసులు వెల్లడించారు. అతడిని బయటకు తీసుకొచ్చేందుకు అధికారులు తొలుత లొంగుబాటుకు అవకాశం కల్పించారు. వీడియో కాల్ ద్వారా సంప్రదించి ఆయుధాలు విడిచిపెట్టి లొంగిపోవాలని కోరారు. లొంగిపోతే ఎలాంటి హాని జరగకుండా చూస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. అయితే అధికారుల విజ్ఞప్తిని అతడు తిరస్కరించడంతో భద్రతా బలగాలు ఆపరేషన్ కొనసాగించాయి. చివరకు అతడిని హతమార్చాయి. ఈ ఘటనలో మసీదుకు ఎలాంటి నష్టం జరగలేదని పోలీసులు స్పష్టం చేశారు.

నవంబర్ 16న తప్పించుకుని.. చివరకు హతం

కుల్గాం జిల్లాలోని లారూ ప్రాంతంలో నవంబర్ 16న భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో లతీఫ్ భట్ బుల్లెట్ గాయాలతో తప్పించుకున్నట్లు సమాచారం. ఇదే ఆపరేషన్‌లో మరో ఉగ్రవాది ఉమర్ నాసిర్ దార్ హతమయ్యాడు. దీంతో లతీఫ్ కోసం భద్రతా బలగాలు గాలింపును మరింత ముమ్మరం చేశాయి. సైన్యం, సీఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసులు సంయుక్తంగా అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. చివరకు అతడి కదలికలను గుర్తించి చుట్టుముట్టాయి. ఈ ఆపరేషన్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. జమ్మూకశ్మీర్ పోలీసులు, భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్ బలగాలు అత్యున్నత సమన్వయంతో ఆపరేషన్ నిర్వహించాయని ప్రశంసించారు. దేశ భద్రత కోసం ధైర్యసాహసాలు ప్రదర్శించిన జవాన్లకు దేశం వందనం చేస్తోందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

3వార్డు పింఛన్దారులకు మంజూరి పత్రాల పంపిణీ



ఖానాపూర్ నవంబర్ 18(ప్రజా జ్యోతి) ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పింఛన్ పత్రాలను ఖానాపూర్ పట్టణ మూడో వార్డు కౌన్సిలర్ సాజిదా బేగం జామాల్ కురిసి లబ్ధిదారులకు స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో అందజేశారు ఎమ్మెల్యే బొజ్జు పటేల్ బుధవారం కొత్త చేయూత ఆసరా పింఛన్ల మంజూరు పత్రాలను ప్రారంభించిన అనంతరం వార్డుల వారీగా కౌన్సిలర్లు తమ వాడలో గల పింఛన్ దారులకు మంజూరు పత్రాలు అందజేశారు రానున్న రోజుల్లో వృద్ధాప్య పింఛన్లు కూడా మంజూరి అవుతాయని అర్హులైన వారందరికీ ఇప్పించేందుకు ఎమ్మెల్యే ద్వారా కృషి చేస్తామని కౌన్సిలర్ సాజిదా బేగం అన్నారు అర్హులైన వారందరికీ పింఛన్లు తప్పకుండా మంజూరు అవుతాయని త్వరలోనే చెల్లింపులు జరుగుతాయని అన్నారు